

నేటి దర్శిని తెలుగు దిన పత్రిక లో
ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365



# నేటి దర్శిని

WWW.NETIDARSHINI.COM

RNI NO: TGTEL/25/A0471


తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...



రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి దర్శిని ఆహ్వానం పలుకుతుంది. తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.



Contact Number
9059328777



రంగారెడ్డి మంగళవారం 24-03-2026 సంపుటి: 01 సంచిక : 278 వేల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Ranga Reddy Tuesday 24-03-2026 Volume :01 Issue: 278 Cost: 2 Pages:08 Editor : Katta HimaPavani


# కొవిడ్ తరహాలో సిద్ధం కావాలి!



## పశ్చిమాసియా యుద్ధంతో ఈ వేసవిలో భారత్‌కు సవాలే

- చర్చలు, దౌత్య మార్గాలే యుద్ధ ముగింపునకు పరిష్కారం
- లోక్‌సభలో ప్రధాని మోదీ ప్రకటన

న్యూఢిల్లీ మార్చి 23 నేటి దర్శిని,

పశ్చిమాసియా యుద్ధం కారణంగా ఏర్పడిన క్లిష్టమైన ప్రపంచ పరిస్థితులు చాలా కాలం పాటు కొనసాగే అవకాశం ఉందని ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం తెలిపారు. కొవిడ్-19 మహమ్మారి సమయంలో దేశం ఐక్యంగా నిలబడినట్లే ఇప్పుడు కూడా సంసిద్ధంగా, ఐక్యంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

-మిగతా 2 లో

## యుద్ధానికి బ్రేక్



- ఇరాన్ విద్యుత్ ప్లాంట్లు, ఇంధన మౌలిక సదుపాయాలపై ఐదు రోజుల పాటు దాడులు వాయిదా
- సామాజిక మాధ్యమాల్లో అమెరికా అధ్యక్షుడి పోస్ట్
- నమ్మలేం.. చర్చలే జరగలేదు : ఇరాన్ ప్రకటన
- పెదవి విప్పని ఇజ్రాయిల్... దాడులు కొనసాగింపు

2 లో

## 2011 సెన్సస్ ఆధారంగా మహిళా రిజర్వేషన్లు!..



- చట్ట సవరణకు కేంద్రం కసరత్తు వచ్చే వారం రాజ్యసభలో సవరణ బిల్లు
- 2029 కన్నా ముందే అమలు చేసేందుకు యోచన

2 లో

## మాది గుడ్ గవర్నెన్స్ కాదు...

# స్మార్ట్ గవర్నెన్స్

## హైదరాబాద్ అభివృద్ధికి అందరూ సహకరించాలి



- మూసీ ప్రక్షాళనతోనే కాలుష్య నివారణ సాధ్యం
- నగరంలోని పరిశ్రమలు ఓఆర్ఆర్ అవతలకు తరలింపు
- రూ.24 వేల కోట్లతో 74 కిలోమీటర్ల మేరకు మెట్రో విస్తరణ
- ఎలివేటెడ్ కారిడార్లతో అద్భుత నగరంగా హైదరాబాద్
- శాసనమండలిలో సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్, మార్చి 23 నేటి దర్శిని,

ఎలివేటెడ్ కారిడార్లతో హైదరాబాద్ అద్భుత నగరంగా మారుతుందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. క్యూర్, ప్యూర్, రేర్‌గా విభజించి ట్రాఫిక్ రద్దీ తగ్గేలా చూస్తున్నామని చెప్పారు. శాసన మండలిలో ఆయన మాట్లాడుతూ..తెలంగాణ రూపురేఖలు మార్చేందుకే క్యూర్, ప్యూర్, రేర్ మోడల్ తీసుకొస్తున్నామని వ్యాఖ్యానించారు. కాలుష్యకారక పరిశ్రమలను ఓ ఆర్ ఆర్ బయటకు తరలిస్తామని తెలిపారు. నగరంలో ఉన్న పరిశ్రమలను సిటీ బయటకు తరలిస్తే.. ఆ భూములను మల్టీజోన్స్‌గా వినియోగించుకోవచ్చని వివరించారు. మెట్రో విస్తరణకు ఎల్ అండ్ టీ ఎందుకు సహకరించ లేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం సూచన మేరకే మెట్రోను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. రూ.15 వేల కోట్లతో మెట్రోను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు.

-మిగతా 2 లో



## సకాలంలో ఉద్యోగులకు జీతాలు చెల్లింపు

- పెండింగ్ బిల్లులు కూడా త్వరలోనే చెల్లిస్తాం
- బిఆర్ఎస్ వదిలిన మూడు డిఎలు కూడా చెల్లిస్తాం
- బకాయిలు చెల్లించలేక పదవీ విరమణ పెంచారు
- ఉద్యోగుల సమస్యలపై అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, మార్చి 23 నేటి దర్శిని,

ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 15వ తేదీ తర్వాతే ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు చెల్లించేవారు.. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు మొదటి తేదీనే వేతనాలు చెల్లిస్తున్నాం అని డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క అన్నారు. బిఆర్ఎస్ నేతలు పెండింగ్ లో పెట్టి వెళ్లిన మూడు డి ఏ ల ను మా ప్రభుత్వం చెల్లించిందని అసెంబ్లీలో చెప్పారు. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల భారం తప్పించుకునేందుకు గత ప్రభుత్వం ఉద్యోగుల పదవీ విరమణ వయసును మూడు సంవత్సరాలకు పెంచిందన్నారు.

-మిగతా 2 లో

## ఇరాన్‌పై ప్రేముంటే అక్కడికే వెళ్లిపోండి'..

- షియా ముస్లింలకు పాక్ ఆర్మీ చీఫ్ హెచ్చరిక..!

2 లో






## బియ్యం ఎగుమతలపై అసెంబ్లీలో మాటల యుద్ధం

- అక్రమాలు జరిగాయన్న హరీష్ రావు
- హౌజ్ కమిటీ వేయాలని డిమాండ్
- హరీష్ వ్యాఖ్యలను తోసిపుచ్చిన మంత్రి ఉత్తమ్

హైదరాబాద్,మార్చి 23 నేటి దర్శిని,

బియ్యం రవాణాపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అసత్యాలు చెప్పారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఫిలిప్పీన్స్‌కు బియ్యం పంపడంలో కుంభకోణం జరిగిందని ఆరోపించారు. సీబీఐ, ఈడీ కేసులున్న ప్రేమ్‌చంద్ గార్గ్‌ను సలహాదారుగా పెట్టుకున్నారని ఆక్షేపించారు. ఆయన ఇప్పుడు ఎక్కడ ఉన్నారో ప్రభుత్వం చెప్పాలని హరీశ్ ప్రశ్నించారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన ఈ అంశంపై మాట్లాడారు. 'బియ్యం ఎగుమతి కోసం టెండర్లు పిలిచారా?నాఫెడ్‌కు అనుమతి ఇవ్వకుండా నామినేషన్ పద్ధతిలో ప్రైవేట్ సంస్థకు ఎందుకిచ్చారో చెప్పాలి. కాకినాడ పోర్టులో 7,500 టన్నుల బియ్యం ఉన్నది నిజమా.. కాదా?ఆ పోర్టులో గిడ్డంగి, నిర్వహణ ఛార్జీలు

-మిగతా 2 లో



## మీ దయను ఎన్నటికీ మరువం..

- కశ్మీరీల మానవతా సాయంపై ఇరాన్ స్పందన
- మహిళలు తమ వ్యక్తిగత బంగారు ఆభరణాలు, విలువైన గృహోపకరణాలను విరాళం
- భరణాలతో పాటు సాంప్రదాయ రాగి వస్తువులు, పశువులను కూడా విరాళంగా అందచేత

శ్రీనగర్:

యుద్ధ పీడిత ఇరాన్‌కు విరాళాలు అందజేసేందుకు కశ్మీర్ ప్రజలు ముందుకు వచ్చారు. పశ్చిమ ఆసియాలో సంఘర్షణ కారణంగా ఇరాన్‌లో ప్రభావితమైన ప్రజలకు మద్దతుగా బుద్గామ్, బారాముల్లా జిల్లాల్లో మానవతా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈద్ వేడుకల తర్వాత షియా ప్రాబల్య ప్రాంతాల వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి విరాళాలు సేకరించారు. కశ్మీర్ ప్రజలు కేవలం డబ్బు మాత్రమే కాకుండా, బంగారం, వెండి ఆభరణాలతో పాటు సాంప్రదాయ రాగి వస్తువులు, పశువులను కూడా విరాళంగా అందించారు. కాగా, చాలా మంది మహిళలు తమ వ్యక్తిగత బంగారు ఆభరణాలు, విలువైన గృహోపకరణాలను విరాళంగా అందజేశారు. ఒక కశ్మీరీ వితంతువు తన భర్త జ్ఞాపకార్థం 28 ఏళ్లుగా దాచుకున్న బంగారు జ్ఞాపికను విరాళంగా ఇచ్చింది. పిల్లలు కూడా తమ పొదుపు, ఈద్ డబ్బును విరాళంగా ఇచ్చారు. ఇరాన్‌లో సహాయక చర్యల కోసం తన ఒక నెల జీతాన్ని విరాళంగా ఇస్తానని బుద్గాం ఎమ్మెల్యే ముంతాజిర్ మెహదీ ప్రకటించారు. మరోవైపు కశ్మీర్ ప్రజలు అందజేసిన విరాళాలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను భారత్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం సోషల్ మీడియాలో షేర్ చేసింది.

-మిగతా 2 లో

## పలు కీలక బిల్లులను ఆమోదించిన

# క్యాబినెట్!

## పలు బిల్లులపై చర్చించిన మంత్రివర్గం

- గిగ్ వర్కర్లకు రోణగా బిల్లు తెచ్చే ప్రతిపాదన
- మెట్రో స్వాధీన ప్రక్రియ వేగవంతం చేయాలని నిర్ణయం
- అడ్వకేట్స్ రక్షనకు చట్టం రూపొందించే ఆలోచన
- సిఎం రేవతం అధ్యక్షతన కేబినేట్ భేటీలో పలు నిర్ణయాలు

హైదరాబాద్, మార్చి 23 నేటి దర్శిని,

ఈ అసెంబ్లీ సమావేశంలో ప్రవేశపెట్టాలసిన మొత్తం 10 కీలక అంశాలపై కకేబినేట్‌లో చర్చ జరిగినట్లు తెలుస్తోంది. సభలో ప్రవేశపెట్టాల్సిన మూడు ముఖ్య బిల్లులపై కేబినెట్ సభ్యులు సమగ్రంగా చర్చించారని సమాచరం. ముఖ్యంగా గిగ్ వర్కర్ల సంక్షేమ బిల్లుపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం. అసెంబ్లీ కమిటీ హాల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం సోమవారం

-మిగతా 2 లో



## కొవిడ్ తరహాలో సిద్ధం కావాలి!

మొదటి తరువాయి

లోక్‌సభలో ఒక ప్రకటన చేస్తూ ఇంధనం, ఎరువులు, జాతీయ భద్రత, దేశంలోని ఇతర రంగాలు, పశ్చిమాసియాలో నివసిస్తున్న భారతీయులపై యుద్ధ ప్రభావానికి సంబంధించిన ఆందోళనలను ప్రస్తావించారు. పశ్చిమాసియాలో పరిస్థితులు తీవ్ర ఆందోళనకరమని అన్నారు. యుద్ధంతో తీవ్ర పర్యవసనాలు ఎదురు కానున్నాయని, దీర్ఘ కాలిక ప్రభావానికి భారత్ సంసిద్ధం కావాలన్నారు.'యుద్ధంతో మొదలయ్యే మరో సవాల్.. భారత్‌లో వేసవి మొదలుకానున్నది. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతల పెరుగుదలతో విద్యుత్తుకు డిమాండ్ పెరుగనున్నది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా అన్ని పవర్ ప్లాంట్లలో తగినన్ని బొగ్గు నిల్వలు ఉన్నాయి' అని ప్రధాని పేర్కొన్నారు. భారత్ వద్ద 53 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు ఉన్నాయని, మరో 65 లక్షల మెట్రక్ టన్నులకు పైగా పెట్రోలియం నిల్వలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నదని ఆయన తెలిపారు. ఇవి గాకుండా దేశీయ చమురు కంపెనీల వద్ద కూడా నిల్వలు ఉన్నాయని ప్రధాని చెప్పారు. పశ్చిమాసియా సంక్షోభంపై భారత పార్లమెంట్ నుంచి ప్రపంచానికి ఒకే గొంతుక వెళ్లాలని పిలుపునిచ్చారు.

## సకాలంలో ఉద్యోగులకు జీతాలు చెల్లింపు

మొదటి తరువాయి

ప్రభుత్వ ఉద్యోగుల పదవి విరమణ వయస్సును 58 సంవత్సరాల నుంచి 61 సంవత్సరాలకు పెంచింది. నాలుగవ తరగతి ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 సంవత్సరాల నుంచి 65 సంవత్సరాలకు పెంచింది. ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంచడంతో 17వేల మంది ఉద్యోగుల పదవీ విరమణ ప్రయోజనాల భారం ప్రజా ప్రభుత్వం పైపడిందని అన్నారు. ఇప్పటికే ఉద్యోగుల మెడికల్ బిల్లులను మొత్తం క్లియర్ చేశాం. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి గత ప్రభుత్వం 40, 150 కోట్లు బకాయిలు పెట్టారు. ఈ విషయంపై సభలో శ్వేత పత్రం విడుదల చేసాం. ఆ బకాయిల్లో ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బిల్లుల మొత్తం 4,575 కోట్లు ఉన్నాయని వివరించారు.

మా ప్రభుత్వం వచ్చాక ఉద్యోగుల పెండింగ్ బిల్లులు క్లియర్ చేసేందుకు ప్రతినెల 700 కోట్లు క్రమం తప్పకుండా చెల్లిస్తున్నాం. రాబోయే రోజుల్లో బకాయిలు త్వరితగతిన క్లియర్ చేసేందుకు ప్రతినెలా చెల్లించి 700 కోట్లను 1000 కోట్లకు పెంచాలని విధానపరమైన నిర్ణయం తీసుకునే ఆలోచన ఈ ప్రభుత్వం చేస్తుందని భట్టి అన్నారు. తాము ప్రతి సమస్యనూ మానవీయ కోణంలోనే చూస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన మూడు డీఏ బకాయిలను గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని చెప్పారు. అవన్నీ త్వరలోనే చెల్లిస్తామని చెప్పారు. శాసనసభలో ఆయన మాట్లాడారు. పదవీ విరమణ ప్రయోజనాలను గత ప్రభుత్వం చెల్లించలేదు. రిటైర్‌మెంట్ ప్రయోజనాలు చెల్లించలేకే పదవీ విరమణ వయసు పెంచారు. దీంతో మా ప్రభుత్వంపై అదనపు భారం పడింది. గత ప్రభుత్వం రూ.40,154 కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టింది. ఉద్యోగులకు కూడా రూ.4,571 కోట్లు బకాయిలు పెట్టింది. సాధ్యమైనంత త్వరగా ఉద్యోగులకు బకాయిలు చెల్లిస్తాం. మానవీయ కోణం ఉంది కాబట్టే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నాం. ఉద్యోగులకు నగదు రహిత ఆరోగ్య కార్డులు ఇస్తున్నాం అని చెప్పారు.

## పలు కీలక బిల్లులను ఆమోదించిన క్యాబినెట్!

మొదటి తరువాయి

సాయంత్రం జరిగింది. రాష్ట్రంలో సుమారు 3 నుంచి 4 లక్షల మంది గిగ్ వర్కర్లకు ప్రయోజనం చేకూరేలా ఈ బిల్లును రూపొందించినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ బిల్లులో గిగ్ వర్కర్లకు సామాజిక భద్రత, సంక్షేమ పథకాలు అందించే విధంగా ప్రతిపాదనలు ఉన్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా కోర్ అర్బన్ యాక్ట్ డ్రాఫ్ట్ బిల్లుపై కూడా కేబినెట్‌లో చర్చ కొనసాగినట్లు సమాచారం. మొత్తంగా ఈ కేబినెట్ సమావేశంలో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.విద్వేషపూరిత ప్రసంగాలు.. నేరాల నిరోధక బిల్లు, తెలంగాణ ప్లాట్‌ఫామ్ ఆధారిత గిగ్ వర్కర్ల బిల్లు, తెలంగాణ అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లులకు ఆమోదం తెలిపింది. ఎల్అండ్‌టీ నుంచి మెట్రో స్వాధీన ప్రక్రియ వేగవంతం చేయాలని నిర్ణయించింది. ప్రభుత్వం తరఫున లావాదేవీల నిర్వహణ బాధ్యతను హెచ్ఎంఆర్ఎల్‌కు అప్పగించింది. కులగణనపై జస్టిస్ సుదర్శన్‌రెడ్డి కమిటీ ఇచ్చిన నివేదికకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. నిపుణుల కమిటీ నివేదికను పరిశీలించే బాధ్యత క్యాబినెట్ సబ్‌కమిటీకి అప్పగించింది. రోహిత్ వేముల చట్టం విధివిధానాల కోసం సబ్ కమిటీ ఏర్పాటు చేస్తూ తీర్మానించింది. ఈ కమిటీ ఛైర్మన్‌గా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కమిటీ సభ్యులుగా మంత్రులు దామోదర రాజనరసింహ, శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్, పొన్నం ప్రభాకర్ వ్యవహరించనున్నారు.

## మీ దయను ఎన్నటికీ మరువం..

మొదటి తరువాయి

ఇరాన్ పునర్నిర్మాణం కోసం డబ్బు, ఆభరణాలను విరాళంగా ఇచ్చిన భారతీయుల 'దయ', 'మానవత్వానికి' కృతజ్ఞతలు తెలిపింది. 'మానవతా మద్దతు, హృదయపూర్వక సంఘీభావంతో ఇరాన్ ప్రజలకు అండగా నిలిచిన కశ్మీర్ ప్రజలకు మేం హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నాం. ఈ దయ ఎప్పటికీ మరిచిపోలేం. భారత దేశానికి ధన్యవాదాలు' అని ఇరాన్ రాయబార కార్యాలయం ఎక్స్‌లో పేర్కొంది. అయితే ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో ప్రభావిత ప్రజలకు సహాయం కోసం భారత్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం వారం కిందటే సోషల్ మీడియాలో బ్యాంకు ఖాతా వివరాలను షేర్ చేసింది. ఇరాన్ రాయబార కార్యాలయంతో పాటు అధికారిక సహాయక సంస్థల ద్వారా సేకరించిన విరాళాలు అవసరమైన వారికి పంపిణీ చేయనున్నట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలో యుద్ధ ప్రభావిత ఇరాన్ ప్రజలకు మద్దతుగా భారత్ నుంచి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి.

## బియ్యం ఎగుమతలపై అసెంబ్లీలో మాటల యుద్ధం

మొదటి తరువాయి

చెల్లిస్తున్నారా?లేదా?బియ్యం రవాణాలో కుంభకోణం జరిగింది. దీంతో ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగింది. ఈ అంశంపై హౌస్ కమిటీ వేసి నన్ను కూడా సభ్యుడిగా ఉంచాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. బియ్యం ఎగుమతులపై తెలంగాణ అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, హరీశ్ రావు మధ్య మాటల యుద్ధం సాగింది. ఫిలిప్పైన్ తో కు బియ్యం ఎగుమతుల్లో భారీ కుంభకోణం జరిగిందని హరీశ్ రావు ఆరోపించారు. ఫిలిప్పిన్స్ తో ఒప్పందం కోసం గార్గ్ ను అడ్వైజర్ గా పెట్టుకున్నారని.. గార్గ్ అనే వ్యక్తి ఈడీ ,సీబీఐ కేసులు ఎదుర్కొంటున్నాడని ఆరోపించారు. బియ్యం ఎగుమతుల కోసం ఎంఓయూ కుదుర్చుకున్నారా? అని ప్రశ్నించారు. కాకినాడ పోర్టులో 7 వేల 500 మెట్రిక్ టన్నుల బియ్యం .. ఏడాదిగా ముక్కిపోయాయని విమర్శించారు. బియ్యం ఎగుమతితో సివిల్ సప్లైస్ శాఖకు కోట్ల నష్టం జరిగిందని ఆరోపించారు. బియ్యం ఎగుమతిపై హౌస్ కమిటీ వేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. హరీశ్ వ్యాఖ్యలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ బియ్యాన్ని విదేశాలకు ఎగుమతి చేస్తున్నామని చెప్పారు. ఫిలిప్పిన్స్ తో బియ్యం ఎగుమతులకు ఒప్పందం కుదుర్చుకున్నామని చెప్పారు. బియ్యం ఎగుమతులపై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం అని మండిపడ్డారు. ఏమీ తెలియకుండా స్కాం అంటూ హరీశ్ రావు ఆరోపిస్తున్నారని చెప్పారు. షిప్పింగ్ చార్జీలు, గోదాం ఛార్జీలు చార్జీలన్నీ ఫిలిప్పైన్స్ చూసుకుంటుందన్నారు. రైతులు పండించిన ప్రతీ ధాన్యపు గింజ కొంటున్నామని చెప్పారు. గత సర్కార్ కంటే ఎక్కువగా రైతులకు మేలు చేస్తున్నామని తెలిపారు.

# యుద్ధానికి బ్రేక్

-- ఇరాన్ విద్యుత్ ప్లాంట్లు, ఇంధన మౌలిక సదుపాయాలపై ఐదు రోజుల పాటు దాడులు వాయిదా
-- సామాజిక మాధ్యమాల్లో అమెరికా అధ్యక్షుడి పోస్ట్
-- నమ్మలేం.. చర్చలే జరగలేదు : ఇరాన్ ప్రకటన
-- పెదవి విప్పని ఇజ్రాయిల్... దాడులు కొనసాగింపు



**వాషింగ్టన్ :**
ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధంలో సోమవారం కీలక పరిణామం చోటుచేసుకుంది. 'ఇరాన్‌తో రెండు రోజులుగా సానుకూలంగా చర్చలు జరుగుతున్నాయి. అందువల్ల ఇరాన్ విద్యుత్ ప్లాంట్లు, ఇంధన మౌలిక సదుపాయాలపై దాడులను ఐదు రోజుల పాటు వాయిదా వేస్తున్నాం.' అంటూ సోషల్ మీడియాలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన పోస్టు కలకలం రేపింది. 'హార్ముజ్ జలసంధిని తెరవకపోతే ..' అంటూ ఆయన విధించిన డెడ్‌లైన్ మరి కొన్ని గంటల్లో ముగియనుండటంతో ఏ క్షణమైనా భీకర దాడులు ప్రారంభమవుతాయని ప్రపంచమంతా ఆందోళన చెందుతున్న సమయంలో ఈ పోస్ట్ వెలువడింది. ట్రంప్ సొంత సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్'లో ప్రత్యక్షమైన ఈ పోస్ట్ ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. సోమవారం సాయంత్రం ఈ ప్రకటన చేసిన తరువాత మూడుసార్లు విలేకరులతో మాట్లాడిన ట్రంప్ ఇరాన్‌తో చర్చలు జరుగుతున్నాయని, ఒక కీలకమైన నేతతో మాట్లాడుతున్నామని, మంచి డీల్ కుదురుతుందని, ఇజ్రాయిల్‌కు కూడా ఈ డీల్ నచ్చుతుందని చెప్పారు. అయితే, చర్చలే జరగలేదని, అటువంటి అవకాశమే లేదని ఇరాన్ ప్రకటించడంతో ట్రంప్ చేసిన ఈ ప్రకటనల వెనుక మతలబేంటన్న దానిపై రకరకాల విశ్లేషణలు వెలువడ్డాయి. ట్రంప్ మరో గేమ్‌కు తెరతీశారా... అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి తగ్గట్టే ట్రంప్ పోస్ట్‌పై అమెరికా నుండి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇజ్రాయిల్ ఇరాన్‌పై దాడులు కొనసాగించింది. ట్రంప్ ప్రకటనపై పెదవి విప్పడానికి ఇజ్రాయిల్ నేతలు సిద్ధపడలేదు.

**ట్రంప్ పోస్టులో ఏముంది?**
అమెరికా సంయుక్త రాష్ట్రాలు, ఇరాన్ రెండు రోజులుగా పశ్చిమాసియాలో ఉన్న వైరం పూర్తిగా, సమగ్రంగా పరిష్కరించేందుకు చర్చలు జరుపు తున్నాం. ఇవి మంచి, ఫలప్రదమైన వాతావరణంలో జరుగుతున్నాయని తెలియచేయడం చాలా సంతోషంగా ఉంది. సమగ్రంగా, సవివరంగా, నిర్మాణాత్మక ంగా జరుగుతున్న ఈ చర్చలు ఈ వారం అంతా కొనసాగుతాయి. ఈ చర్చల సానుకూలతను, విజయాన్ని పరిగణనలోకి తీసుకొని, ఇరాన్ విద్యుత్ కేంద్రాలు, ఇంధన మౌలిక వసతులపై జరిగే అన్ని సైనిక దాడులను ఐదు రోజులపాటు వాయిదా వేయాలని యుద్ధ విభాగానికి ఆదేశించాను.'

## మాది గుడ్ గవర్నెన్స్ కాదు...స్మార్ట్ గవర్నెన్స్

మొదటి తరువాయి

ఏ రాష్ట్రంలోనైనా ఎయిర్‌పోర్టులకు మెట్రో కనెక్టివిటీ ఉంటుందని.. కానీ తెలంగాణలో అలాంటి పరిస్థితి లేదని తెలిపారు. జూన్, జులైలోపు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. పంజాగుట్ట, హైటెక్‌సిటీ, జూబ్లీహిల్స్‌లో ఎలివేటెడ్ కారిడార్లు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. రూ.24 వేల కోట్లతో 74 కిలోమీటర్ల మేరకు మెట్రోను విస్తరిస్తామని తెలిపారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా బేగంపేట ఎయిర్‌పోర్టు మధ్య నుంచి అండర్‌పాస్ నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. సిగ్నల్స్ దగ్గర వాహనాలు ఆగకుండా వెళ్లాలనేదే తమ ఆలోచన అని చెప్పుకొచ్చారు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణలే కొన్ని ప్రమాదాలకు కారణమని అన్నారు. చిరు వ్యాపారులకు ఇబ్బంది ఉన్నా ఆక్రమణలు తొలగిస్తామని స్పష్టం చేశారు. ఢిల్లీ మాదిరిగా కాలుష్య నగరం కాకూడదనే హిల్ట్ పాలసీ తీసుకువచ్చామని వివరించారు. ప్రతిపక్షాల నేతలు హిల్ట్‌పాలసీపై ఆరోపణలు, అసత్య ప్రచారాలు చేయొద్దని హితవు పలికారు. అభివృద్ధికి అడ్డంకులు సృష్టించొద్దని కోరారు. నగరం నుంచి బయటకు వెళ్లేందుకే ఎలివేటెడ్ కారిడార్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మూసీ ప్రాజెక్టుతోపాటు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం జరుగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎలివేటెడ్ కారిడార్లకు ఎక్కువ భూమి కూడా అవసరం లేదని క్లారిటీ ఇచ్చారు. గతంలో మాదిరిగా నచ్చితే నజరానా.. లేకపోతే జరిమానా విధించే విధానం ఉండదని చెప్పుకొచ్చారు. గుడ్ గవర్నెన్స్ కాదని.. మాది స్మార్ట్ గవర్నెన్స్ అని వ్యాఖ్యానించారు. అనేక సంస్కరణలు తీసుకొస్తున్నామని.. ప్రతిపక్షాలు, ప్రజలు సహకరించాలని సూచించారు. ప్రతిపక్షాల నేతలు అభివృద్ధిని అడ్డుకోవాలని చూడొద్దని.. ఏవైనా సూచనలు ఉంటే ఇవ్వండి.. స్వీకరిస్తామని పేర్కొన్నారు. మూసీ ప్రక్షాళన అత్యంత అవసరమని తెలిపారు. మూసీ కాలుష్యంతో నల్గొండ జిల్లా ప్రజలు నరకం చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పండించిన పంటలు కూడా తినే పరిస్థితి లేదని అన్నారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను తమ ప్రభుత్వం తీసుకురాలేదని..కేసీఆర్ హయాంలో తీసుకొచ్చిన విధానాన్నే తాము కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు. గుజరాత్‌లో సబర్మతి ప్రక్షాళనకు కాంగ్రెస్ సహకరించిందని ప్రస్తావించారు. హైదరాబాద్‌లో మూసీ ప్రక్షాళనకు రాజకీయ రంగు ఎందుకు? అని ప్రశ్నించారు. ఎవరినీ నిరాశ్రయులను చేయం.. పునరావాసం కల్పిస్తామని భరోసా కల్పించారు. ప్రతిపక్షాల నేతలు అడ్డుకోవడం తప్పించి.. ఏ సలహా ఇచ్చినా తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎవరికీ నష్టం కలిగించం.. బాధితులందరినీ ఆదుకుంటామని మాటిచ్చారు. మూసీ పరివాహకంలో ఉన్న అందరికీ మెరుగైన వసతులు కల్పిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో వర్షం పడిందంటే కదల్లేని పరిస్థితి ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులకు ఇబ్బందులు తప్పట్లేదని తెలిపారు. హైదరాబాద్‌ను విస్తరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దేశంలో ఐదు మెట్రో నగరాలైన హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు అత్యంత కీలకమైనవని చెప్పుకొచ్చారు. పెట్టుబడులను నగరాల నిర్మాణం, నిర్వహణ నిర్దేశిస్తాయని అన్నారు. నగరాలపైనే రాష్ట్రాల ప్రగతి ఆధారపడి ఉంటుందని తెలిపారు. ఢిల్లీలో కాలుష్యం వల్లే స్కూల్స్, ఆఫీసులకు సెలవులు ఇస్తున్నారని ప్రస్తావించారు. ముంబైలో వర్షం పడిందంటే కదల్లేని పరిస్థితి ఉందని చెప్పుకొచ్చారు. చెన్నై, బెంగళూరులోనూ ట్రాఫిక్ కష్టాలు తప్పట్లేదని అన్నారు. మానవ తప్పిదాల వల్లే అనేక కష్టాలు వస్తున్నాయని ప్రస్తావించారు. హైదరాబాద్ అంటే లేక్స్ అండ్ రాక్స్ సిటీ అని చెప్పుకొచ్చారు. ఓల్డ్ సిటీగా పిలుస్తున్న ప్రాంతం ఒకప్పుడు ఒరిజినల్ సిటీ అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆదాయ మార్గాలు మెరుగుపడటంతో ప్రతి కుటుంబంలో కార్లు పెరిగాయి. ట్రాఫిక్ రద్దీ వల్లే మెట్రో, ఎంఎంటీఎస్ విస్తరించుకున్నాం. హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ బాగా పెరిగింది. కాలుష్యం వెదజల్లే పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు తరలిస్తాం. రోడ్లను అండర్‌పాస్‌లు, సర్ఫేస్, ఎలివేటెడ్ కారిడార్లుగా విభజించాం. ఎక్కడా ట్రాఫిక్ ఆగకూడదనేదే మా లక్ష్యం. మెట్రో విస్తరణకు ఎల్ అండ్ టీ ముందుకు రాలేదు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల నేపథ్యంలో రూ.15వేల కోట్లు కేటాయించి మెట్రోను స్వాధీనం చేసుకున్నాం. ఈ ప్రాజెక్టును మరో 76 కి.మీ విస్తరిస్తాం. విస్తరణకు కేంద్రం కూడా సానుకూలంగా స్పందించింది. నగర శివార్ల నుంచి వచ్చే ఉద్యోగుల సంఖ్య బాగా పెరిగింది. శామీర్‌పేట, మేడ్చల్ వైపు ఎలివేటెడ్ కారిడార్లు నిర్మిస్తాం. దీనికోసం కేంద్ర సంస్థలతో మాట్లాడి భూమి తీసుకుంటున్నాం. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లో రోడ్ల విస్తరణకు ఇబ్బందులు ఉన్నాయి. సిగ్నల్ వద్ద వాహనాలు ఆగకుండా వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నాం. రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగిస్తున్నాం. చిరువ్యాపారులకు ఇతర చోట్ల స్థలాలు కేటాయిస్తాం. కొన్నిచోట్ల మల్టీ లెవల్ కారు పార్కింగ్‌లు ఏర్పాటు చేస్తున్నాం. ముందు జాగ్రత్త తీసుకోకుంటే ఢిల్లీ వలే కాలుష్యం పెరిగిపోతుంది. ఓఆర్ఆర్ లోపల పలుచోట్ల రేడియల్ రోడ్లు వేస్తున్నాం. దూరం తగ్గించేందుకు ఎలివేటెడ్ కారిడార్లు నిర్మిస్తున్నాం. సిటీ మధ్య నుంచి అన్ని ప్రాంతాలకూ ఇవి వస్తాయి. దీంతో హైదరాబాద్ అద్భుత నగరంగా మారుతుంది. డ్రైనేజీ వ్యవస్థను మారిస్తే మూసీ సుందరీకరణ త్వరగా పూర్తవుతుంది. 30వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నాం. ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. క్యూర్‌లో సర్వీస్ సెక్టార్, ప్యూర్‌లో ఇండస్ట్రియల్ సెక్టార్, రేర్‌లో అగ్రికల్చరల్ సెక్టార్ రానుంది. గుజరాత్ అభివృద్ధిలో భాజపాకు కాంగ్రెస్ పూర్తి సహకారం అందించింది. అన్ని పార్టీల నేతలూ ఒక్కటై నగర అభివృద్ధికి కలిసి రావాలని కోరారు.

## 2011 సెన్సస్ ఆధారంగా మహిళా రిజర్వేషన్లు!

-చట్ట సవరణకు కేంద్రం కసరత్తు
-వచ్చే వారం రాజ్యసభలో సవరణ బిల్లు
-2029 కన్నా ముందే అమలు చేసేందుకు యోచన



**న్యూఢిల్లీ,**
బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం 2011 జనాభా లెక్కల ఆధారంగా మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ప్రతిపాదిత స్వరూపం ప్రకారం లోక్‌సభ సీట్ల సంఖ్య 543 నుంచి 816కు పెరుగుతాయి. ఇందులో 273 సీట్లలో మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తారు. కొత్త సెన్సస్, నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ తర్వాతే రిజర్వేషన్లు అమలు చేయాల్సి ఉంటుందని ఈ చట్టం నిర్దేశిస్తున్నది.యితే ప్రభుత్వం మాత్రం ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లోనే చట్టాన్ని సవరించి పార్లమెంట్ దిగువ సభలో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచాలని యోచిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ రాజ్యాంగ సవరణ బిల్లు సజావుగా ఆమోదం పొందేందుకు ప్రతిపక్షాలను కూడా ప్రభుత్వం ప్రాథమికంగా సంప్రదించినట్లు తెలుస్తున్నది. క్యాబినెట్ ఆమోదం తర్వాత ముందుగా వచ్చే వారం రాజ్యసభలో సవరణ బిల్లును ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్టు అధికారులు భావిస్తున్నారు.

**మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల**
2023లో ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ల బిల్లుతో లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల లభిస్తుంది. నియోజకవర్గాల పునర్విభజన కాకపోవడంతో ఈ చట్టం అమల్లోకి రాలేదు. నియోజకవర్గాల పునర్విభజనకు ముందుగానే ఈ చట్టాన్ని అమలు చేయాలంటే మరో రాజ్యాంగ సవరణ తప్పనిసరి. చట్టం ఏర్పడిన తర్వాత వచ్చే మొదటి జనాభా లెక్కల సేకరణ అనంతరం చేపట్టే నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే మహిళలకు రిజర్వేషన్‌ను అమలుచేయాలని చట్టం నిర్దేశిస్తున్నది. నియోజకవర్గాల పునర్విభజనకు అతీతంగా ఇది అమలు చేయాలంటే ఈ చట్టంలోని సెక్షన్ 5ని ప్రభుత్వం సవరించాల్సి ఉంటుంది.

ఇది పార్లమెంట్ ఉభయ సభల్లో హాజరైన సభ్యుల్లో మూడింట రెండు వంతుల మంది ఆమోదంతోనే చట్ట సవరణ చేయాల్సి ఉంటుందని రాజ్యాంగంలోని 368(2) అధికరణ నిర్దేశిస్తున్నది. లోక్‌సభలో 240 మంది ఎంపీలు, రాజ్యసభలో 103 మంది ఎంపీల బలం ఉన్న బీజేపీకి విపక్షాల మద్దతు లేకుండా ఈ సవరణను ఆమోదించడం సాధ్యపడదు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు కోసం విధానాలు, రోడ్డుమ్యాప్‌ను చర్చించేందుకు అఖిల పక్ష సమావేశాన్ని నిర్వహించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజును కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గతవారం కోరారు.

## ఇరాన్‌పై ప్రేముంటే అక్కడికే వెళ్లిపోండి'

### షియా ముస్లింలకు పాక్ ఆర్మీ చీఫ్ హెచ్చరిక..!

**న్యూఢిల్లీ,**
పశ్చిమాసియాలో ఇరాన్‌పై ఇజ్రాయేల్, అమెరికా దాడులను ప్రపంచంలోని షియా ముస్లిం లు వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. పాకిస్థాన్‌లోనూ షియా మత పెద్దలు ఇరాన్‌పై యుద్ధాన్ని ఖండిస్తున్నారు. దాంతో, చిర్రెత్తుకొచ్చిన ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ వారిని ద్దేశించి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'ఇరాన్‌ను చాలా ప్రేమిస్తున్నారా? అయితే.. షియా ముస్లింలంతా ఇరాన్ వెళ్లిపోవచ్చు' అని షియా వర్గాన్ని ఆయన హెచ్చరించారు. మునీర్ వ్యాఖ్యలపై మత పెద్దలు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు.పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ షియా ముస్లింలపై, మత పెద్దలపై మండిపడ్డారు. ఇరాన్‌పై ఇజ్రాయేల్, అమెరికా దాడులను నిరసిస్తున్న షియాలను టార్గెట్ చేసిన ఆయన.. 'ఇరాన్‌పై అంతగా ప్రేమ ఉంటే.. ఇక్కడెందుకు ఉన్నారు. ఆ దేశమే వెళ్లిపోండి' అని అన్నారు. మునీర్ వ్యాఖ్యలను షియా ముస్లిం మతపెద్దలు తీవ్రంగా తప్పుబట్టారు.'అమెరికా, ఇజ్రాయేల్ తొత్తుగా మారిన అసిమ్ మునీర్ పాకిస్థాన్ ప్రయోజనాలను వ్యతిరేకంగా పని



చేస్తున్నారు. ప్రభుత్వాన్ని అస్థిర పరుస్తూ దేశాన్ని నాశనం చేస్తున్నారు' అని షియా ఉలేమా కౌన్సిల్ పాకిస్థాన్ సెంట్రల్ ఉపాధ్యక్షుడు అల్లామ సయ్యద్ సిబటెన్ హైదర్ సబ్జవారీ విమర్శించారు. పాకిస్థాన్‌ను విడిచి వెళ్లాల్సింది తాము కాదని.. అమెరికా, ఇజ్రాయేల్‌కు వంత పాడుతున్న మునీర్ వెళ్లాలని ఆయన ధ్వజమెత్తారు. 'మీ గురువులైన అమెరికా, ఇజ్రాయేల్‌పై అమితంగా ప్రేమ ఉంటే మీరే పాకిస్థాన్‌ను వదలి వెళ్లండి' అని అల్లామ సయ్యద్ సిబటెన్ హైదర్ సబ్జవారీ కౌంటర్ అటాక్ చేశారు.ఇరాన్‌పై యుద్ధాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న షియా ముస్లింలు పాకిస్థాన్‌లో నిరసనలు తెలుపుతున్నారు. సుప్రీం లీడర్ అయతొల్లా ఖమేనీని చంపడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన షియాలు మార్చి తొలివారం కరాచీలో ర్యాలీ నిర్వహించారు. అయితే.. భద్రతా దళాలు జరిపిన కాల్పుల్లో 35 మంది ప్రాణాలు కోల్పోయారు.

# భగత్ సింగ్ స్ఫూర్తితో యువత మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలి: కొండేటి శ్రీను

●నిడమానూరులో ఘనంగా భగత్ సింగ్ 95వ వర్ధంతి

●భగత్ సింగ్, రాజుగురు, సుఖదేవ్‌లకు నివాళులు



**నిడమానూరు, మార్చి 23 (నేటి దర్శిని):**
నిడమానూరు మండల కేంద్రంలో సోమవారం సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో స్వాతంత్ర సమరయోధుడు షహీద్ భగత్ సింగ్ 95వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొండేటి శ్రీను, మండల కార్యదర్శి కందుకూరి కోటేష్, సీఐటీయూ జిల్లా నాయకులు కోమాండ్ల గుర్వయ్య మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం అతి చిన్న వయసులోనే బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడి అమరుడైన మహనీయుడు భగత్ సింగ్ అని పేర్కొన్నారు. బ్రిటిష్ పాలనలో ప్రజలు ఎదుర్కొన్న కష్టాలను చూసి చిన్న వయసులోనే దేశం పట్ల అపారమైన ప్రేమతో పోరాటం ప్రారంభించారని తెలిపారు. తన కుటుంబం, చదువులు, వ్యక్తిగత భవిష్యత్తును పక్కనబెట్టి దేశం కోసం ప్రాణత్యాగం చేసిన గొప్ప దేశభక్తుడు భగత్ సింగ్ అని కొనియాడారు. భగత్ సింగ్‌తో పాటు రాజుగురు, సుఖదేవ్ వంటి వీరులకు నివాళులు అర్పించారు. భగత్ సింగ్ దేశభక్తి నేటి యువతకు ఆదర్శంగా నిలవాలని, మతోన్మాదానికి వ్యతిరేకంగా యువత పోరాటానికి సిద్ధం కావాలని కొండేటి శ్రీను పిలుపునిచ్చారు. స్వాతంత్ర సమరయోధుల చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలను ఖండిస్తూ, నిజమైన చరిత్రను కొత్త తరాలకు అందించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు మల్లికాంటి చంద్రశేఖర్, కోరే రమేష్, వేంపటి మహేష్, బొడ్డు లింగయ్య, వర్షిత్, కోమాండ్ల ఆంజనేయులు, విష్ణు, మధు, వెంకన్న, వింజమూరి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# మహబూబ్ నగర్‌లో మినీ సరస్ ఫెయిర్ 2026






● భరోసా కేంద్రం అవగాహన స్టాల్ ప్రారంభం



**మిడ్జిల్, మార్చి 22, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):**
మహబూబ్నగర్ పట్టణంలోని శిల్పారామంలో 23.03.2026 నుండి 29.03.2026 వరకు డి.ఆర్.డి.ఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మినీ సరస్ ఫెయిర్‌లో గ్రామీణ స్వయం సహాయక సంఘాలు తయారుచేసిన చేనేత, హస్తకళ మరియు ఆహార ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలు జరుగుతున్నాయి. ఈ ఫెయిర్‌కు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో, మహబూబ్నగర్ జిల్లా పోలీసుల తరపున మహిళలు మరియు బాలబాలికల భద్రత కోసం ఏర్పాటు చేసిన భరోసా కేంద్రం సేవలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేయబడింది. జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఈ స్టాల్‌ను మహబూబ్నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గుమ్మాల మమత గారి చేతుల మీదుగా ప్రారంభించబడింది. ఈ సందర్భంగా భరోసా కేంద్రం ద్వారా అందించే సేవలు మరియు లాభాలను ప్రజలకు వివరించారు:మహిళలు, బాలబాలికలపై జరిగే హింస, వేధింపులు, దౌర్జన్యాలకు గురైన బాధితులకు సురక్షిత వాతావరణంలో సహాయం కౌన్సిలింగ్ సేవలు ద్వారా మానసిక ధైర్యం కల్పించడం అవసరమైనప్పుడు న్యాయ సహాయం మరియు కేసులపై మార్గదర్శకం మెడికల్ సపోర్ట్ మరియు ఇతర అత్యవసర సేవలు బాధితులకు సంబంధించిన ఫిర్యాదులను వేగంగా స్వీకరించి, సంబంధిత విభాగాలతో సమన్వయం చేయడం కుటుంబ వివాదాల పరిష్కారం కోసం సమాధానపూర్వక చర్చలు భరోసా కేంద్రం సభ్యులు స్టాల్‌ను సందర్శిస్తున్న ప్రజలకు ఈ సేవలపై ప్రత్యక్షంగా అవగాహన కల్పిస్తూ, ఎలాంటి సమస్యలు వచ్చినా భయపడకుండా పోలీసులను సంప్రదించాలని సూచిస్తున్నారు. మహబూబ్నగర్ జిల్లా పోలీసులు ప్రజల భద్రతకు కట్టుబడి ఉన్నారని, మహిళలు మరియు పిల్లల రక్షణకు భరోసా కేంద్రం ఒక విశ్వసనీయ వేదికగా పనిచేస్తుందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ క్రమంలో డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి, గ్రంధాలయ చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, DSP వెంకటేశ్వర్లు, DCRB DSP రమణా రెడ్డి, వుమెన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, భరోసా ఇంచార్జి WSI అరుణ, భరోసా కేంద్రం సభ్యులు పాల్గొన్నారు.

# సమస్యలపై పోరాటం చేస్తామంటే అక్రమ అరెస్టులు చేస్తారా?

●పోలీసులను అడ్డం పెట్టుకొని ప్రతిపక్షాల గొంతును ముస్తారా?

●బిజెపి యువ మోర్చా జిల్లా అధ్యక్షులు పల్లె తిరుపతి



**మిడ్జిల్, మార్చి23, (నేటి దర్శిని ప్రతినిధి):**
ఎంతమందిని అరెస్టు చేసిన రాష్ట్ర ప్రభుత్వంపై బీజేపీ పోరాటం చేస్తూనే ఉంటుందని, సమస్యలపై పోరాటం చేస్తామంటే అక్రమ అరెస్టులు చేయడం ఎంతవరకు సమంజసం అని, పోలీసులను అడ్డం పెట్టుకుని ప్రతిపక్షాల గొంతు నొక్కడం ఇకపై మానుకోవాలని పాలమూరు జిల్లా బిజెపి యువ మోర్చా జిల్లా అధ్యక్షులు పల్లె తిరుపతి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్ర రావు పిలుపు మేరకు చలో అసెంబ్లీ కార్యక్రమం కు పిలుపునిచ్చిన సందర్భంలో ఈరోజు ఉదయం మిడ్జిల్ గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి నాలుగో వార్షికోత్సవ కార్యక్రమంలో పూజలో గుడిలో ఉన్న మమ్మల్ని ముందస్తు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించిన పల్లె తిరుపతి గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడానికి ఇచ్చిన 6 హామీలు నెరవేర్చకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని ఆరు గ్యారెంటీ ల పేరుతో అధికారంలోకి వచ్చి ప్రతి మహిళకు స్కూటీ ఇస్తా అని చెప్పారు,పెన్షన్ పెంచుతామని చెప్పారు, కళ్యాణ లక్ష్మి లో తులం బంగారం ఇస్తామని చెప్పారు, రైతు భరోసా కింద ప్రతి ఆరు నెలకు ఒకసారి ఎకరాకు 6000 రూపాయలు ఇస్తామని ,చెప్పి ఇప్పటికీ రైతు భరోసా డబ్బులు పంపిణీ చేయలేదు విద్యార్థులకు స్కాలర్షిప్లు ఇవ్వడం లేదు మహిళలకు ఉచితంగా వడ్డీ లేని రుణాలు ఇస్తామని వాగ్దానం చేశారు ఇలా కాంగ్రెస్ ప్రభుత్వ యొక్క మోసాలు చెప్పుకుంటూ పోతే చాలా ఉన్నాయి కాబట్టి రాబోవు రోజుల్లో ప్రజలు చైతన్యవంతులై ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ఈ అరెస్టులతోని ఉద్యమాన్ని ఆపలేరు గత బి ఆర్ ఎస్ కు పట్టిన గతే కాంగ్రెస్ కు పడుతుందని అరెస్టులు కాదు ఆరు గ్యారెంటీలు అమలు చేయండి అని వారు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని అరెస్టు చేసిన హామీలు నెరవేర్చే వరకు పోరాటం చేస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు....

# అరెస్టులు అప్రజాస్వామికం

● బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్. రాజేశ్వర్




**మిడ్జిల్,మార్చి 23, (నేటి దర్శిని ప్రతినిధి):**
అసెంబ్లీ ముట్టడికి వెళుతున్న బిజెపి నాయకులను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్. రాజేశ్వర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలు 420 హామీలను ఆమలు చేయాలనీ రాష్ట్ర అధ్యక్షు లు రామచందర్ రావు చేపట్టిన దీక్షకు మద్దతుగా బయ లుదేరే బిజెపి నాయకులను సోమవారం ఉదయమే ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ ప్రభుత్వం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యాన్ని కూని చేయడమే అవుతుందన్నా రు.ఇచ్చిన మాట నిలుపు కోవడం చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు క్షమాపణ చెప్పాలనీ డిమాండ్ చేశా రు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలా నిరంకుశంగా అరెస్టు లను వ్యతిరేకిస్తు న్నామని అన్నారు.ప్రతి ఒక్కరు ఖండించాలని కోరారు

# గ్యాస్ కొరతపై దొంగ నాటకాలంటూ బీఆర్ఎస్ నిరసన




**ఎల్.బీ.నగర్,మార్చి23 (నేటి దర్శిని):**
రాష్ట్రంలో గ్యాస్ సరఫరా సమస్యపై రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం మరియు కేంద్ర బీజేపీ ప్రభుత్వాలపై బీఆర్ఎస్ పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎల్‌బీనగర్ చౌరస్తా వద్ద సోమవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సరఫరా ఎక్కడా ఆగలేదని పేర్కొంటుండగా, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం సరైన సరఫరా లేకపోవడం వల్లే సమస్యలు వస్తున్నాయని చెబుతుండడం ప్రజలను గందరగోళానికి గురిచేస్తోందని విమర్శించారు. ఈ పరస్పర ఆరోపణల మధ్య సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేకంగా ఆటో డ్రైవర్లు, టిఫిన్ సెంటర్ యజమానులు, వృద్ధాశ్రమాల నిర్వహకులు గ్యాస్ కొరత కారణంగా తమ దైనందిన కార్యకలాపాలను నిర్వహించడంలో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గ్యాస్ కొరతను ఉద్దేశపూర్వకంగా సృష్టించి బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని, అవి నిజమైతే ఇది తీవ్రమైన అన్యాయం అని తెలిపారు. ప్రభుత్వాల అసమర్థతను కప్పిపుచ్చేందుకు రాజకీయ ఆరోపణలు చేసుకుంటూ ప్రజా సమస్యలను పక్కన పెట్టడం సరికాదని, వెంటనే సరఫరా వ్యవస్థలో పారదర్శకత తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమస్యను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాలను కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన మాజీ కార్పొరేటర్లు, సీనియర్ బీఆర్ఎస్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా నాయకులు, ఉద్యమకారులు, కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు మరియు పార్టీ అభిమానులు భారీగా పాల్గొన్నారు.

# శ్రీ భద్రకాళి దేవాలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలు



**ఉమ్మడి వరంగల్, మార్చి 23 (నేటి దర్శిని బ్యూరో)**
ఓరుగల్లు ప్రసిద్ధి చెందిన చారిత్రాత్మక శ్రీ భద్రకాళి దేవాలయంలో శ్రీ పరాభవ నామ సంవత్సర వసంత నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అమ్మవారికి వసంత రుతువు శుక్లపక్షాన్ని పురస్కరించుకొని శాస్త్రోక్తంగా విశేష అభిషేకాలు అర్చనలు నిర్వహించారు .ఆలయ ప్రధాన అర్చకులు శేషు ఆధ్వర్యంలో వేదపండితులు విశేష పూజలు జరిపి అమ్మవారిని శోభయమానంగా అలంకరించారు .అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# సంపాదకీయం

## కల్తీ ముప్పు!



మొన్న సికింద్రాబాద్‌లో టాస్క్‌ఫోర్స్ దాడుల్లో రెండువేల ఆరువందల కిలోల నకిలీ పన్నీర్ పట్టుబడింది. తీగలాగితే డొంక కదిలినట్టుగా దీని ఆధారంగా మరికొన్నిచోట్ల తనిఖీలు చేయగా మరో మూడువేల కిలోల పన్నీర్ దొరికింది. ఈ పన్నీర్‌ను హోటళ్లు, క్యాటరింగ్ సెంటర్లకు సరఫరా చేస్తున్నట్టు విచారణలో వెల్లడైంది. తయారీలో రసాయనాలు, నాణ్యతలేని పదార్థాలు ఉపయోగించినట్లు అధికారులు గుర్తించారు. నిన్న జియాగూడలో డెబ్బయి రెండు డ్రమ్ముల కల్తీ పచ్చడి పట్టుకున్నారు. అంతకుముందు కూడా పలుచోట్ల చేసిన సోదాల్లో నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్, కల్తీ మిర్చిపొడి, పసుపు, గడువు ముగిసిన ఆహారపదార్థాలు పట్టుబడ్డాయి. ఈ వరుస ఘటనలతో నగరంలో ఆహారభద్రతపై ఆందోళన మొదలైంది. ఈ యాంత్రిక జీవనంలో చాలామంది హోటళ్లు, రెస్టారెంట్లు, స్ట్రీట్ ఫుడ్ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. దీన్నే ఆసరగా చేసుకున్న అక్రమార్కులు కల్తీదందాకు యథేచ్ఛగా తెరలేపుతున్నారు. పండగ సీజన్‌లలో ఇది మరీ ఎక్కువగా ఉంటోంది. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం ఏం చేస్తోందన్నదే ఇక్కడ ప్రశ్న. ఎవరో సమాచారమిస్తే తప్ప నేరుగా పట్టుకోలేని నిద్రావస్తలో అధికార యంత్రాంగం ఉండటం శోచనీయం! ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్న కల్తీ ఆహార దందాలను ప్రజల ఆరోగ్యంపై పెరుగుతున్న దాడిగానే భావించాలి. రోజువారిగా వినియోగించే ఆహారపదార్థాల్లోనే నకిలీ, కల్తీ పదార్థాలు కలిపి విక్రయించడం సామాన్య ప్రజల జీవన భద్రతకు సవాల్‌గా మారింది. పాలు, నెయ్యి, నూనెలు, మసాలాల వంటి ఎక్కువ అవసరమైన వస్తువులే కల్తీకి గురవుతున్న పరిస్థితి నెలకొంది. భారీ స్థాయిలో నకిలీ ఆహార పదార్థాలను నిల్వచేసి ఉంచడంలో కేవలం వ్యాపారుల దురాశే కాకుండా, ఇందులో ప్రజల ఆరోగ్యంతో ఆటలాడే క్రూరత్వం కూడా కనిపిస్తోంది. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందాలనుకునే ఆశతో కొంతమంది నాణ్యతను పూర్తిగా పక్కనపెట్టి ప్రమాదకరమైన రసాయనాలను ఉపయోగించడం అత్యంత ప్రమాదకరం. రసాయనాలు కలిపిన పచ్చళ్లు, నిల్వ కోసం వాడే హానికర పదార్థాలు, కృత్రిమ రంగులు ఇవన్నీ శరీరంపై నెమ్మదిగా విషంలా పనిచేస్తాయి. జీర్ణసమస్యలు, కాలేయ వ్యాధులు, క్యాన్సర్ వరకు దారితీసే ప్రమాదం ఉంది. పిల్లలు, వృద్ధులపై తీవ్ర ప్రభావం కలిగిస్తాయి. ఫుడ్ పాయిజన్ కేసులు పెరగడానికి కూడా ఆహార పదార్థాలలో నాణ్యత లేకపోవడమే ప్రధాన కారణం. ఇంకా పలుచోట్ల చేసిన తనిఖీల్లో మూడు వేల కిలోల కల్తీ నెయ్యి పట్టుబడింది. పదకొండు వందల కిలోలకు పైగా కల్తీ జింజర్-గార్లిక్ పేస్ట్ స్వాధీనమైంది. వీటిలో సిట్రిక్ యాసిడ్, ఇతర రసాయనాలు కలిపి తయారు చేసి హోటళ్లకు సరఫరా చేస్తున్నట్టు వెల్లడైంది. జియాగూడలో నకిలీ పచ్చళ్ల కేంద్రంపై చేసిన దాడిలో పాడైన కూరగాయలు, అతి తక్కువ నాణ్యత గల పదార్థాలతో తయారు చేస్తున్నట్టు నిర్ధారణ అయింది. బోరబండ, సికింద్రాబాద్‌లో పెద్దస్థాయిలో అనధికార యూనిట్లు, గోదాములు బయటపడటం చూస్తే ఇదంతా వ్యవస్థీకృత మాఫియాలా కనిపిస్తోంది. ఇది కేవలం వ్యక్తిగత ఆరోగ్యానికే కాదు, సమాజానికే ముప్పుగా మారుతోంది. కల్తీ ఆహారం కేవలం నాణ్యత సమస్యే కాదు, అది నేరపూరితం. ఇది ప్రభుత్వ పర్యవేక్షణ లోపమే తప్ప వేరేకాదు. ఏదైనా ఘటన జరిగినప్పుడు మాత్రమే అధికార యంత్రాంగం హడావిడి చేస్తుంది తప్ప, దీనికి శాశ్వత పరిష్కారం చూపడటం లేదు. దాడులు జరిగినప్పుడు తప్ప, ఆ తర్వాత యథావిధిగా సాగడం పరిపాటిగా మారింది. బీఎన్ఎస్, ఫుడ్ సేఫ్టీ యాక్ట్ ప్రకారం కల్తీ ఆహారం లేదా డ్రింక్స్ అమ్మితే కనీసం ఆరునెలల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధించాలి. తీవ్రమైన అనారోగ్యానికి గురైనా, ప్రాణపాయం ఏరపడినా జైలు, లేదా జీవితఖైదు విధించే అవకాశం ఉంది. ఈ లెక్కన ఎంత మందిని శిక్షించారు? ఎన్ని కేసులు నమోదు చేశారు? వేళ్లపై లెక్కకట్టేలా కూడా ఉండవంటే అతిశయోక్తికాదేమో! ఇలా చూస్తే పచ్చళ్లు, పేస్ట్‌లు వంటి రోజువారి ఆహార పదర్థాలన్నీ కల్తీకి గురవుతున్నాయి. అంటే, మన ప్లేట్‌లో పడే ప్రతిపదార్థం కూడా ఇప్పుడు అనుమానాస్పదంగా మారుతోంది. ఇందులో వినియోగదారుల పాత్రను కూడా తీసిపారేయలేం. తక్కువ ధరల ఆశతో నాణ్యత లేని ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా ఈ నకిలీ దందాను మనమే ప్రోత్సహిస్తున్నట్టు అవుతోంది. సరైన ప్రమాణాలు ఉన్న ఉత్పత్తులను ఎంపిక చేయడం, ప్యాకింగ్ తయారీ తేదీ, ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తించడం, తయారీ లేబుళ్లను గమనించడం అత్యంత అవసరం. కల్తీ ఆహార దందాను అరికట్టాలంటే కేవలం దాడులు సరిపోవు. కఠినమైన శిక్షలు వేగవంతమైన న్యాయప్రక్రియ, ప్రజల్లో అవగాహన- ఈ మూడు కలిసొస్తేనే ఫలితం ఉంటుంది. లేదంటే 'కల్తీ ఆహారం' అనే ముప్పు మన సమాజాన్ని నిశ్శబ్దంగా కబళిస్తూనే ఉంటుంది.




## 53 లక్షల మెట్రిక్ టన్నుల స్ట్రాటజిక్

# రిజర్వ్ పెట్రోల్ ఉంది

**న్యూఢిల్లీ మార్చి 23 నేటి దర్శిని,**
పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితిపై ప్రధాని మోదీ లోక్‌సభలో మాట్లాడారు. దౌత్యం, చర్చల ద్వారానే సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. దౌత్యపరమైన అంశంలో భారత్ స్పష్టంగా ఉందని, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను తగ్గించేందుకు భారత్ ప్రయత్నిస్తోందన్నారు. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దళాలు దాడులు చేస్తున్న నేపథ్యంలో పశ్చిమాసియా పరిస్థితులు ఆందోళనకరంగా మారిన విషయం తెలిసిందే. హోర్ముజ్ జలసంధిని మూసివేయడంతో చమురు సమస్యలు పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ తన ప్రసంగంలో పలు అంశాలను ప్రస్తావించారు. ఈ యుద్ధం నుంచి ఉద్భవించే పరిస్థితులు చాన్నాళ్లు ప్రభావం చూపనున్నట్లు ఆయన వెల్లడించారు. ఆ పరిస్థితులను ఎదుర్కోనేందుకు సిద్ధంగా ఉండాలని, ఐక్యంగా ఉండాలని ఆయన అన్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితిని కొందరు అడ్వాంటేజ్ తీసుకునే అవకాశాలు ఉన్నాయని, అందుకే శాంతి భద్రతలను సరైన రీతిలో మానిటర్ చేయాలన్నారు. సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు భారత్ సిద్ధంగా ఉందని ప్రధాని అన్నారు. గత దశాబ్ధం కాలం నుంచి ఇలాంటి సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు




ప్రియార్టీ ఇచ్చామని, దీనిలో భాగంగా ముడి చమురును స్టోరేజీని పెంచామన్నారు. భారత్ వద్ద ప్రస్తుతం 53 లక్షల మెట్రిక్ టన్నుల స్ట్రాటజిక్ రిజర్వ్ పెట్రోల్ ఉందని ప్రధాని వెల్లడించారు. ఇది ఆయల్ కంపెనీల వద్ద ఉన్న రిజర్వ్‌లకు సంబంధం లేనిదని ఆయన అన్నారు. గడిచిన 11 ఏళ్ల కాలంలో రిఫైనరీ కేపాసిటీ కూడా పెంచుకున్నామని ప్రధాని తెలిపారు. వ్యవసాయంపై కూడా పశ్చిమాసియా యుద్ధ ప్రభావం పడుతుందని, కానీ ప్రభుత్వం మాత్రం కావాల్సినంత ఫెర్టిలైజర్‌ను సమకూర్చుతోందన్నారు రైతులపై కోవిడ్ లాంటి పరిస్థితులు ప్రభావం పడకుండా చూస్తున్నామన్నారు. రైతులను ఆదుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. పశ్చిమాసియాలో యుద్ధం మొదలైన తర్వాత ఇప్పటి వరకు 3.75 లక్షల మంది భారతీయులు తిరిగి వచ్చినట్లు చెప్పారు. కేవలం ఇరాన్ నుంచి 1000 మంది భారతీయులు సురక్షితంగా వచ్చినట్లు వెల్లడించారు. దీంట్లో ఎంబీబీఎస్ చదువుతున్న 700 మంది విద్యార్థులు ఉన్నారు. పశ్చిమాసియా ప్రభావాన్ని తగ్గించేందుకు స్వల్ప కాలిక, మధ్యశ్రేణి, దీర్ఘకాలిక వ్యూహాలను అనుసరిస్తున్నట్లు చెప్పారు. యుద్ధం జరుగుతున్న పశ్చిమాసియాలో పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. పశ్చిమాసియా సంక్షోభం పట్ల భారత పార్లమెంట్ ఒకే స్వరాన్ని వినిపించాలన్నారు. ఆ సంక్షోభం మొదలై మూడు వారాలు దాటిందని, ప్రతి ఒక్కరికీ అది ప్రభావం చూపుతోందని, యుద్ధం జరుగుతున్న దేశాలతో భారత్‌కు కీలకమైన వ్యాపార లావాదేవీలు ఉన్నట్లు ఆయన చెప్పారు. భారత్ వద్ద 53 లక్షల మెట్రిక్ టన్నుల పెట్రోలియం రిజర్వ్‌లు ఉన్నాయని, ఇథనాల్ బ్లెండింగ్ వల్ల .. గతంతో పోలిస్తే భారత్ సుమారు 4.5 కోట్ల బ్యారళ్ల ఇంధనాన్ని తక్కువ దిగుమతి చేసుకుంటోందని ప్రధాని తెలిపారు.

# కూలిన యుద్ధ విమానం

**-వందమందికిపైగా సైనికులు మృతి**
**-కొలంబియా దక్షిణ అమెజాన్ ప్రాంతంలో ప్రమాదం**
**-ధ్రువీకరించిన కొలంబియా రక్షణమంత్రి సాంచెజ్**

**బోగోటా:న్యూఢిల్లీ మార్చి 23 నేటి దర్శిని,**
దక్షిణ కొలంబియాలోని పుట్యుమాయో ప్రావిన్స్‌లో కొలంబియా వైమానిక దళానికి చెందిన 'లాక్ హీడ్ మార్టిన్ హెర్క్యులస్ సీ-130' రవాణా విమానం కూలిపోయింది. ఈ ప్రమాదంలో వందమందికిపైగా సైనికులు మృతి చెందారు. ప్రమాదం జరిగిన సమయంలో విమానంలో సుమారు 110 మంది ప్రయాణిస్తున్నట్టు స్థానిక మీడియా సంస్థ బ్లూ రేడియో వెల్లడించింది. పెరూ సరిహద్దుకు సమీపంలోని ప్వర్టో లెగుయిజామో ఎయిర్‌ఫీల్డ్ నుంచి ఈ విమానం టేకాఫ్ తీసుకుంటున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది.



**సరిహద్దు ప్రాంతంలో ప్రమాదం**
ఈ విమాన ప్రమాదంపై కొలంబియా రక్షణ మంత్రి పెడ్రో ఆర్నుల్ఫో సాంచెజ్ అధికారిక ప్రకటన విడుదల చేశారు. అమెజాన్ అడవుల మధ్య ఉన్న దక్షిణ సరిహద్దు ప్రాంతంలో భద్రతా దళాలను తరలిస్తుండగా ప్రమాదం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదని, సాంకేతిక లోపం వల్ల జరిగిందా లేదా ఇతర కారణాలా? అనే కోణంలో విచారణ జరుపుతున్నామని మంత్రి తెలిపారు. ప్రమాద సమయంలో విమానంలో 80 నుంచి 110 మంది వరకు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. అయితే ఈ విమానం కూలిన ప్రదేశం పట్టణ కేంద్రానికి కేవలం 3 కిలోమీటర్ల దూరంలోనే ఉంది.

**మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి**
"ఇది అత్యంత బాధాకరమైన సమయం. బాధిత కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నా." అని మంత్రి సాంచెజ్ అన్నారు.

**కొనసాగుతున్న సహాయక చర్యలు**
ప్రమాద వార్త తెలిసిన వెంటనే సైనిక విభాగాలు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. విమానం మంటల్లో పూర్తిగా కాలిపోయినట్టు వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. గత నెలలో కూడా ఇలాంటిదే హెర్క్యులస్ విమానం బొలీవియాలో కూలి 20 మందికి పైగా మరణించిన సంగతి తెలిసిందే.

# ఎక్కడికక్కడే బిజెపి నేతల అరెస్ట్

● చేతకాని ప్రభుత్వం గద్దె దిగాలి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీ కాంత్ రెడ్డి డిమాండ్



బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. బంగ్లా లక్ష్మీ కాంత్ రెడ్డి

**మిడ్జిల్,మార్చి 23 (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో),:** ఇచ్చిన హామీలు అమలు చేయడం చేతకాని ప్రభుత్వం గద్దె దిగాలనీ బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీ కాంత్ రెడ్డి డిమాండ్ చేశారు.సోమవారం అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా బిజెపి నాయకుల ను ఎక్కడికక్కడే ముందస్తు అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్ కుతరలించారు.ఈ సందర్భంగా లక్ష్మీకాంత్ రెడ్డి మాట్లాడుతు సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని అన్నారు.నేడు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తే అక్రమంగా అరెస్టులు చేయడం సిగ్గు చేటని అన్నారు. చేత కాని ప్రభుత్వం వెంటనే గద్దె దిగా లని డిమాండ్ చేశారు.అక్రమ అరెస్టులతో గొంతు నొక్కలేర ని స్పష్టం చేశారు.అక్రమ అరెస్టులను ప్రజాస్వామ్య వాదు లందరూ ఖండించాలని రానున్న రోజుల్లో ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని కోరారు.

# పాఠశాల స్థలంపై ఆక్రమణ అధికారుల నిర్లక్ష్యం పై గ్రామస్తులు ఆగ్రహం



తహసీల్దార్




ఎంపీడీవో

**మిడ్జిల్ మార్చి 23( నేటి దర్శిని ప్రతినిధి ):** మిడ్జిల్ మండలం రాణిపేట గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల స్థలం ఆక్రమణకు గురవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు పాఠశాల భూమిని అక్రమంగా ఆక్రమించి, ఆ ప్రాంగణంలో కాంపౌండ్ గోడ నిర్మించడంతో పాటు ఇల్లు, హోటల్ నిర్మాణాలు చేపట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.విద్యార్థుల భవిష్యత్తుకు కీలకమైన పాఠశాల ఆవరణ ఇలా కుదించబడటం పట్ల గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల పిల్లలకు ఆడుకునే స్థలం లేకుండా పోవడం, భద్రతా సమస్యలు తలెత్తే అవకాశం ఉండడం వంటి అంశాలు పరిస్థితిని మరింత ఆందోళనకరంగా మారుస్తున్నాయి. సోమవారం రాణిపేట గ్రామస్తులు పాఠశాల ఉపాధ్యాయులు మండల అధికారులకు ఫిర్యాదు చేసి, తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంపీడీవో గీతాంజలి స్పందించి, సంబంధిత అధికారులతో స్థలాన్ని సర్వే చేయించి, ఖచ్చితమైన హద్దులను నిర్ణయించాలని గ్రామస్తులు కోరుతున్నారు. అలాగే ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుని, పాఠశాల భూమిని తిరిగి స్వాధీనం చేసుకుని విద్యాసంస్థకు కేటాయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో నిర్లక్ష్యం వహిస్తే ఇటువంటి ఘటనలు మరింత పెరిగే ప్రమాదం ఉందని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు.

# నీటిని పునరుద్ధరించి రైతులను ఆదుకోండి....

● కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి...



**ఆమనగల్,మార్చి23(నేటి దర్శిని ప్రతినిధి);** నీటిని పునరుద్ధరించి రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన అసెంబ్లీలో ఈ విషయంపై మాట్లాడారు. కేఎల్ఐ కాలువల ద్వారా 15 రోజుల క్రితం నీటిని నిలుపుదల చేయడంతో కల్వకుర్తి నియోజకవర్గంలో వేసిన పంటలు ఎండిపోతున్నాయని నీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన అసెంబ్లీలో మాట్లాడారు నియోజకవర్గంలో వేరుశెనగ వేసిన రైతులు పంట చేతికి వచ్చే సమయంలో నీటి సరఫరా నిలిపివేశారని కావున నీరు అందించి పంటలను కాపాడాలని ఆయన కోరారు.

# ప్రజాయుత సమస్యలపై పోరాటానికి సంకెళ్లా?

●ఇలా అరెస్టులు చేయడం రాజ్యాంగబద్ధమైన హక్కులను కాలరాయడమే...
●అక్రమ అరెస్టులు ప్రజాస్వామ్యానికే అవమానం....
●భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకుడు, ముచ్చర్ల జనార్దన్ రెడ్డి



బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి

**మిడ్జిల్, మార్చి 23, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** ఇచ్చిన హామీలను నెరవేర్చి అమలు పరచకపోతే ప్రజల పక్షాన నిలబడి ప్రజా సమస్యలపై గలమెత్తి, ప్రజల తరఫున ఉద్యమాలు చేస్తున్న భారతీయ జనతా పార్టీ నాయకులను ఎక్కడికక్కడే రాత్రుళ్లు అక్రమ అరెస్టులు చేయడం ప్రజాస్వామ్యానికే అవమానమని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకుడు, ముచ్చర్ల జనార్దన్ రెడ్డి అన్నారు.భారతదేశ స్వాతంత్రం కూడా బ్రిటిష్ వారిపై శాంతియుతంగా పోరాటాలు నిరసనలు నిరాహార దీక్షల వల్లే బ్రిటిష్ దాస్య శృంఖలాల నుండి భారతదేశానికి స్వాతంత్రం సిద్ధించిందని గుర్తు ఎరగాలని, అందుకు విరుద్ధంగా ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజల సమస్యలు, ప్రభుత్వం ఇచ్చిన హామీల గురించి అడిగితే, నిరసన కార్యక్రమాలు చేపడితే అరెస్టులు, సంకెళ్లు, ఇళ్లలోనే ముందస్తు అరెస్టులు ఇది ప్రజాస్వామ్యానికే అవమానం అన్యాయమని ముచ్చర్ల జనార్దన్ రెడ్డి మండిపడ్డారు.భారతీయ జనతా పార్టీ చేపట్టిన నిరసన దీక్షలో భాగంగా అసెంబ్లీకి చేరి సమస్యల పరిష్కారాలు ప్రభుత్వం ఇచ్చిన హామీలపై గలమెత్తిన రాజకీయ పార్టీ నాయకులను కార్యకర్తలను ఎక్కడికక్కడ రాత్రుళ్ల అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ ఇకముందు ఇలాంటి అప్రజాస్వామ్య ధోరణి విడనాడి ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసి ప్రజల కష్టనష్టాలను దూరం చేసి పేద ప్రజలను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.ఇలాంటి అరెస్టులు రాజ్యాంగబద్ధంగా ప్రజల హక్కులను కాలరాయడమే అవుతుందని , ఈ ప్రభుత్వానికి ప్రజాస్వామ్యంపై రాజ్యాంగంపై నమ్మకం ఉందా లేదా రాజ్యాంగ తరగతులు నిర్వహించి రాజ్యాంగం కల్పించిన హక్కులను వివరించి ఇకముందు ముందస్తు అరెస్టులు కాకుండా సమస్యలపై స్పందించి హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నారు....

# బిజెపి నాయకులను ముందస్తు అరెస్ట్...




**ఆమనగల్, మార్చి23(నేటి దర్శిని ప్రతినిధి);** తెలంగాణ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు పిలుపుమేరకు" అసెంబ్లీ ముట్టడి"కార్యక్రమానికి వెళ్లనివ్వకుండా ఆమనగల్ పోలీసు సిబ్బంది ఆమనగల్ మున్సిపాలిటీ బిజెపి నాయకులను సోమవారం ఉదయం ముందస్తు గా అరెస్టు చేశారు. మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ శ్రీకాంత్ సింగ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని భ్రష్టు పట్టిస్తూ,ప్రజల బతుకులను ఆగం చేస్తూ, భావితరాల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతి,అరాచక పాలనను, ప్రతి పనిలో కమీషన్ల పాలనను నిలదీస్తూ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచంద్రరావు గారి నేతృత్వంలో అసెంబ్లీ ముట్టడికి బయలుదేరుతున్న సందర్భంలో సోమవారం తెల్లవారుజామున ముందస్తుగా కల్వకుర్తి అసెంబ్లీ పరిధిలోని ఆమనగల్ మున్సిపాలిటీ బీజేపీ పార్టీ నాయకులను, కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని శ్రీకాంత్ సింగ్ అన్నారు. మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను వంచించిన కాంగ్రెస్ మెడలు వంచుతామని ఈ ప్రభుత్వం పేదల ఉసురు పోసుకుంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గోరటి నరసింహ, మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షుడు విక్రం రెడ్డి,జిల్లా కౌన్సిల్ సభ్యుడు చెక్కల లక్ష్మణ్, మున్సిపాలిటీ జనరల్ సెక్రెటరీ గోజే ఆనంద్, రమేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్‌కు కొత్త ఐటీఐలు ఎక్కడ?

●ఆధునీకరణలో ఆలస్యం ఎందుకు?
●లోక్ సభలో ప్రశ్నించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**ఉమ్మడి వరంగల్, మార్చి 23(నేటి దర్శిని బ్యూరో):** తెలంగాణలోని ఐటీఐలు, ఎన్ఎస్‌టీఐల స్థితిగతులు, వాటి ఆధునీకరణ అవసరంపై వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య లోక్‌సభలో ప్రశ్నించారు. ముఖ్యంగా వరంగల్ నియోజకవర్గంలో నైపుణ్యాభివృద్ధి అవకాశాలపై స్పష్టత ఇవ్వాలని కేంద్రాన్ని కోరారు. తెలంగాణలో పనిచేస్తున్న ఐటీఐలు, ఎన్ఎస్‌టీఐల సంఖ్య, అందిస్తున్న కోర్సులు, శిక్షణార్థుల నమోదు వివరాలను వెల్లడించాలని కోరారు. ముఖ్యంగా వరంగల్ ప్రాంతంలో ఆధునిక సాంకేతిక రంగాలకు అనుగుణంగా శిక్షణ అందిస్తున్నారా అనే అంశంపై కేంద్రాన్ని ప్రశ్నించారు. యువతకు ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్న నేపథ్యంలో, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఐఓటీ, రిన్యూవబుల్ ఎనర్జీ, 3డీ ప్రింటింగ్ వంటి రంగాల్లో శిక్షణ విస్తరణపై చర్యలు తీసుకున్నారా అని ప్రశ్నించారు. పరిశ్రమలతో భాగస్వామ్యాలు, ట్రైనర్ల నైపుణ్యాభివృద్ధి, ప్లేస్‌మెంట్లపై కూడా వివరాలు తెలియజేయాలన్నారు.ఈ మేరకు నైపుణ్యాభివృద్ధి కేంద్ర సహాయక శాఖా మంత్రి జయంత్ చౌదరి సమాధానమిస్తూ, రాష్ట్రంలో 301 ఐటీఐలు పనిచేస్తున్నాయని, అందులో వరంగల్‌లో 30 ఉన్నాయని తెలిపారు. గత మూడు సంవత్సరాల్లో రాష్ట్రవ్యాప్తంగా 1.30 లక్షల మంది శిక్షణ పొందగా, వరంగల్‌లో 11,754 మంది శిక్షణ పొందినట్లు వెల్లడించారు. అయితే కీలక అంశమైన కొత్త ఐటీఐలు, ఎన్ఎస్‌టీఐల స్థాపనపై ఎలాంటి ప్రతిపాదనలు లేవని కేంద్రం స్పష్టం చేసింది. వరంగల్ వంటి అభివృద్ధి చెందుతున్న ప్రాంతానికి కేంద్రం నుంచి సరైన మద్దతు లభించడం లేదని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. పీఎం–సేతు పథకం ద్వారా ఐటీఐల అభివృద్ధి జరుగుతోందని కేంద్రం చెప్పినా, రాష్ట్రానికి కొత్త సంస్థలు ఇవ్వడంలో నిర్లక్ష్యం ఎందుకని ప్రశ్నించారు.ఈ నేపథ్యంలో, యువతకు ఆధునిక నైపుణ్యాలు అందించడంలో కేంద్రం స్పష్టమైన చర్యలు తీసుకోవాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కోరారు. వరంగల్ అభివృద్ధిపై కేంద్రం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

# 24 ఏళ్ల కలయిక ... అవధుల్లేని ఆనందం



- అ "పూర్వ "మధురస్మృతి
- పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం
- చదువులమ్మ బడి - అమ్మ ఒడి
- సమ్మేళనంలో పాల్గొన్న 1993-2002 బ్యాచ్ విద్యార్థులు

**ఇబ్రహీంపట్నం, మార్చి 23 (నేటి దర్శిని):**
ఆనాటి జ్ఞాపకాలు ఎప్పటికీ మధురస్మృతులే. యాచారం మండల పరిధిలోని కురిమిద్ద పాఠశాలకు చెందిన 7వ తరగతి 1993- 2002 సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థులు కురిమిద్ద ప్రభుత్వ పాఠశాలలో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారంతా తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. దేశ, విదేశాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో స్థిరపడినవారు ఒక చోట కలుసుకుని పాత జ్ఞాపకాలను తలచుకున్నారు. 24 సంవత్సరాల తర్వాత స్నేహితులంతా ఒకేచోట చేరడం చాలా సంతోషాన్ని ఇస్తుందని అన్నారు. మానవ జీవితంలో కులమతాలకు అతీతంగా ఉన్నది కేవలం ఒక స్నేహం మాత్రమేనని అన్నారు. జీవితంలో ఎంత ఉన్నత స్థాయిని ఎదిగిన స్నేహాన్ని మాత్రం మరువలేమన్నారు. ఎవరి ఏ కష్టం వచ్చిన తోటి విద్యార్థులకు అండగా నిలబడాలని నిర్ణయం తీసుకున్నారు. తాము కలిసి చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. ఆనాటి తీపీ గుర్తులను నెమరువేసుకున్నారు. 24 సంవత్సరాల తర్వాత ఇలాంటి వేడుక చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు ఒక్కొక్కరూ ఒక్కొక్క రంగంలో సెటిల్ అవ్వడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు తమ జ్ఞాపకాలను తలుచుకుంటూ, స్వీయ చిత్రాలు తీసుకొని సందడిగా, సంతోషంగా ఆడి పాడారు. ఆనాడు గురువులు తమకు బోధించిన బోధనలు సూచించిన మార్గాలు నేర్పిన క్రమశిక్షణనే తమను ప్రస్తుతం సమాజంలో ఇంతటి ఉన్నత స్థానంలో నిలబడగలిగేలా ప్రేరేపించాయనీ ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. అనంతరం పూర్వ ఉపాధ్యాయులను విధ్యార్థులు శాలువాలతో ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. సమ్మేళనంలో ఉపాధ్యాయులు అంజయ్య, రాజశేఖర్, సరస్వతి, మంజుల, చంద్రకళ, పూర్వ విద్యార్థులు కల్లేపల్లి రవీందర్, జాన్, మూలి మహేందర్, కల్లెపల్లి మహేందర్, శ్రీనివాస్, రవి, శ్రీశైలం, సురేష్, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

# జి డబ్ల్యూ ఎం సి 2026,27 బడ్జెట్ ఆమోదానికి సిద్ధం.....!



**ఉమ్మడి వరంగల్, మార్చి 23 (నేటి దర్శిని బ్యూరో)**
వరంగల్ మహానగర పాలక సంస్థ 2026 ,27 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ ఈనెల 25న ప్రత్యేక కౌన్సిల్ సమావేశంలో బడ్జెట్ ఆమోదం పొందుటకు ప్రవేశపెట్టనున్నట్లు తెలిసింది. జి డబ్ల్యూ ఎం సిఅకౌంటింగ్ విభాగం అధికారులు తయారు చేసిన బడ్జెట్ ను నగరమేయర్ గుండు సుధారాణి ,కలెక్టర్, జి డబ్ల్యు ఎం సి కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ కు అందజేశారు. నగరపాలక సంస్థ పాలకవర్గం పదవీకాలం ముగియనున్న సందర్భముగా ఇదే చివరి బడ్జెట్ సమావేశం అవుతుందేమోనని పరిశీలకులు భావిస్తున్నారు.

# గద్దల ప్రకాశం పంతులు (నాగయ్య) సంతాప సభ

**ఖమ్మం,మార్చి 23 (నేటి దర్శిని):**
ఖమ్మం అర్బన్ కైకొండాయిగూడెం వస్తవులు అదిగద్దల ప్రకాశం పంతులు (నాగయ్య ) సంతాప సభ కైకొండాయిగూడెం డివిజన్-1 నందు జరిగింది. ఈ సభ కు గ్రామం లోని ప్రముఖులు అధిక సంఖ్య లో హాజరైనారు.గద్దల ప్రకాశం పంతులు కైకొండాయిగూడెం నందు ఇటీవల 11-03-2026 తేదీ నాడు కైకొండగూడెం నందు మరణించారు. సభకు హాజరైన ప్రముఖులు మాట్లాడుతు ప్రకాశం పంతులు అకాల మరణం ఎంతో దిగ్భ్రాంతిని కలిగించింది తెలిపారు.గత 30 సంవత్సరాలు చర్చి పంతులుగ మరియు సమాజ సేవకునిగ పని చేసారు. ప్రకాశం పంతులు ఎంతో సాత్విక స్వభావం కలవారు, కష్టాల్లో ఉన్నవారికి ఎప్పుడూ అండగా ఉండేవారు.



సమాజం లో అందరితో కలిసి మెలసి ఉండేవారు. అయన లేని లోటు ఎవరు తీర్చలేరు, ప్రజలలో తనదంటూ గుర్తింపు తెచ్చుకున్న వ్యక్తి గ అయన ముద్ర వేసుకున్నారు. ఆయన ప్రజలకు భౌతికంగా దూరమైనా, తమకు అందించిన జ్ఞాపకాలు మరియు ఆశయాలు ఎప్పటికీ సజీవంగా ఉంటాయి అని కొనియాడారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో గద్దల మోహన్ రావు (పాస్టర్), పి. శ్రీనివాసరావు (డాక్టర్),గద్దల దిలీప్ (లాయర్), గద్దల జనార్దన్ రావు (సిపిఎం గ్రామ కార్యదర్శి), గుర్రం కృష్ణయ్య (డీలర్), గద్దల చిన్నప్ప, గద్దల నాగేశ్వరరావు (తెరాస నాయకులు), బి.రవికుమార్, యలమందల జగదీష్ (నాయి బ్రాహ్మణ టౌన్ ప్రెసిడెంట్ ఃఎలక్ట్రానిక్ మీడియా టౌన్ ప్రెసిడెంట్) మరియు వారి కుమారులు గద్దల జయరాం (ఏ.డి.ఈ), గద్దల వీరబాబు పాల్గొన్నారు.

# ఉమ్మడి వరంగల్ జిల్లాలో రైతుల ఖాతాలోకి రూ .444 కోట్లు విడుదల...!



**ఉమ్మడి వరంగల్, మార్చి 23 (నేటి దర్శిని బ్యూరో):**
ఉమ్మడి వరంగల్ జిల్లాలో 8,84,254 మంది రైతులకు రూపాయలు 444 కోట్లు రైతు భరోసా నిధులు విడుదల చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. వరంగల్ జిల్లాలో 1,55,170 మంది రైతులకు రూపాయలు 75,95,46,280 కోట్లు, హనుమకొండ జిల్లాలో 1,43,394 మంది రైతులకు రూపాయలు 70,05,61,045 కోట్లు, భూపాలపల్లి జిల్లాలో 1,15,177 మందికి రూపాయలు 59,35,19,448 కోట్లు, ములుగు జిల్లాలో 79,040 మంది రైతులకు రూపాయలు 40,98,59,892 కోట్లు, జనగామ జిల్లాలో 1,80,186 మంది రైతులకు రూపాయలు 92,11,17,163 కోట్లు, మహబూబాబాద్ జిల్లా లో 2,11,287 మంది రైతులకు రూపాయలు 10,83,89,309 కోట్లు రైతుల ఎకౌంట్ల లో జమ కానున్నాయని తెలిపారు.

# కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానంలో హుండీ లెక్కింపు







- 145 రోజుల హుండీ రూ.63.84 లక్షల ఆదాయం

**ఎల్.బి.నగర్, మార్చి 23 (నేటి దర్శిని):**
ప్రసిద్ధి చెందిన శ్రీ కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానానికి సంబంధించి గత 145 రోజుల హుండీ ఆదాయాన్ని సోమవారం విప్పి లెక్కించారు. ఈ లెక్కింపులో మొత్తం రూ.63,84,446/- నగదు వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. అదేవిధంగా విదేశీ మారక ద్రవ్యం రూపంలో 67 యూ.ఎస్. డాలర్లు, 5 ఆస్ట్రేలియా డాలర్లు, 1 మలేషియా రింగిట్, 120 అరబ్ దిర్హాంస్, 10 యు.కే. పౌండ్స్, 100 బంగ్లాదేశ్ టాకాస్, 20 శ్రీలంక రూపాయలు, 50 నేపాల్ రూపాయలు లభించాయి.హుండీ లెక్కింపు కార్యక్రమం దేవాదాయ శాఖ పర్యవేక్షకుడు శ్రీ వెంకట్ ప్రేం కుమార్ రావు పర్యవేక్షణలో, ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీమతి యన్. లావణ్య ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా చైర్మన్ ఈదులకంటి సత్యనారాయణతో పాటు ధర్మకర్తలు దిండు ప్రవీణ్ గౌడ్, తోకటి కిరణ్ కుమార్, సింగంశెట్టి శ్రీనివాస్, విష్ణువర్ధన్ రెడ్డి జనుంపల్లి, కుకునూరి గోపాల్ రెడ్డి, పూల నాగరాజు, శ్రీమతి కె. కవిత, ఓరుగంటి నరేష్, బండిగారి శ్రీనివాస్ గౌడ్, ఎనుముల రవీందర్ రెడ్డి, శ్రీమతి యం. రాజేశ్వరి పాల్గొన్నారు. అలాగే ఆలయ అర్చకులు, సిబ్బంది మరియు వివిధ సేవా సంఘాల వాలంటీర్లు ఈ లెక్కింపులో పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీలో కో ఆప్షన్ సభ్యుల భర్తీకి మోక్షం ఎప్పుడో....!




**ఉమ్మడి వరంగల్, మార్చి 23 (నేటి దర్శిని బ్యూరో):**
ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 1,684 గ్రామపంచాయతీల్లో కో ఆప్షన్ సభ్యుల భర్తీ ప్రక్రియ ఎప్పుడు జరగనుందో అనే సంశయము ఏర్పడింది. పంచాయతీరాజ్ చట్టం 2018 ప్రకారం గ్రామపంచాయతీకి ముగ్గురు కో ఆప్షన్ సభ్యులు నియమించుకునే అవకాశం కల్పించింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 5,049 కో ఆప్షన్ సభ్యుల పదవులు ఖాళీగా ఉన్నాయి. వార్డు సభ్యులతో సమానంగా కో ఆప్షన్ సభ్యులకు హోదా ఉన్నప్పటికీ,ఓటు హక్కు మాత్రము ఉండదు. గ్రామపంచాయతీ పాలకవర్గం ఏర్పడిన రెండు నెలల్లో కో ఆప్షన్ సభ్యులు ఎంపిక ప్రక్రియ పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదని ప్రజలు ప్రచారం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కో ఆప్షన్ సభ్యులు ఎంపికకు ఉత్తర్వులు జారీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# వల్మిడి శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం విద్యుత్ కాంతులతో కళకళ....!



**ఉమ్మడి వరంగల్, మార్చి 23 (నేటి దర్శిని బ్యూరో):**
ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వల్మిడీ గ్రామంలో శ్రీ సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు 11 రోజులపాటు జరగనున్నాయి. రెండో భద్రాదిగా ప్రసిద్ధిగాంచిన శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం విద్యుత్ కాంతులతో భక్తులను ఆకర్షిస్తుంది. వాల్మీడీ గుట్టపై స్వయంభుగా వెలసిన సీతారామచంద్రస్వామి దేవాలయం పరిసరాలను అధికారులు విద్యుత్ కాంతులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ప్రధాన రాజ గోపురం, గర్భాలయం, రామలింగేశ్వర స్వామి కోవెల తో పాటు ఆలయ ప్రాంగణం అంతా రంగురంగుల విద్యుత్ దీపాలతో కళ కళలాడుతోంది.



# కరెంట్ షాక్‌తో బర్రె మృతి

- రైతుకు రూ.70 వేల నష్టం

**నిడమనూరు, మార్చి 23 (నేటి దర్శిని):**
నిడమనూరు మండలం బంటు వారి గూడెం గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు గుండెబోయిన వినోద్‌కు చెందిన బర్రె కరెంట్ షాక్ తగిలి మృతి చెందింది. వివరాల ప్రకారం, కరెంట్ స్తంభం నుండి ఇంటి అవసరాల కోసం తీసుకున్న విద్యుత్ వైర్ తెగిపడి బర్రెపై పడడంతో తీవ్ర షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనతో రైతు వినోద్‌కు సుమారు రూ.70 వేల మేర ఆస్తి నష్టం జరిగినట్లు తెలిపారు. తనకు జరిగిన నష్టాన్ని ప్రభుత్వం గుర్తించి ఆర్థిక సహాయం అందించాలని బాధిత రైతు వినోద్ విజ్ఞప్తి చేశారు. గ్రామస్థులు కూడా ఈ ఘటనపై విచారం వ్యక్తం చేస్తూ, విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# బిజినెస్

## ఒక్కసారిగా ఘోరంగా కుప్పకూలిన బంగారం ధరలు..

**గంటల్లోనే బిగ్ క్రాష్.. లేటెస్ట్ రేట్లు చూడండి..**



బంగారం ధరల్లో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. సోమవారం సాయంత్రం కల్లా గోల్డ్ రేట్లు మరింతగా కుప్పకూలాయి. ఉదయం రూ.4 వేలు తగ్గగా.. గంటల వ్యవధిలోనే మరింతగా పడిపోయాయి. ఇక గోల్డ్‌తో పాటు సిల్వర్ రేట్లు కూడా భారీగా పతనమయ్యాయి. గోల్డ్ ఒక్కరోజులోనే రూ.10 వేలు తగ్గింది. దీని తర్వాత ప్రస్తుతం గోల్డ్, సిల్వర్ ధరలు ఎలా ఉన్నాయో చూద్దాం.ప్రస్తుతం హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,35,650 వద్ద కొనసాగుతోందగా.. ఉదయం రూ.1,45,970 వద్ద ఉంది. గంటల్లోనే రూ.10,320 తగ్గింది. ఇక 22 క్యారెట్ల బంగారం రేటు ఇప్పుడు రూ.1,24,350గా ఉండగా.. ఉదయం రూ.1,33,800 వద్ద కొనసాగింది. అంటే రూ.9,450 పడిపోయింది.విజయవాడ, విశాఖపట్నంలో కూడా పై ధరలే కొనసాగుతున్నాయి. ఇక చెన్నైలో 24 క్యారెట్ల రేటు రూ.1,39,200 వద్ద ట్రేడవుతుండగా.. ఉదయం రూ.1,48,580 వద్ద కొనసాగింది. ఇక 22 క్యారెట్ల రూ.1,27,600 వద్ద కొనసాగుతోంది. చెన్నైలో రూ.9380 నేడు పతనమైందని చెప్పవచ్చు.బెంగళూరులో 24 క్యారెట్ల రేటు రూ.1,35,650 వద్ద ట్రేడవుతుండగా.. 22 క్యారెట్ల రేటు రూ.1,24,350 వద్ద కొనసాగుతోంది. అటు ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,35,800 వద్ద కొనసాగుతుండగా.. 22 క్యారెట్ల ధర రూ.1,24,500గా ఉంది. అటు వెండి ధరలు కూడా ఒక్కసారిగా పడిపోయాయి.ఢిల్లీలో కేజీ వెండి ధర రూ.2.30 లక్షలుగా ఉంది. ఉదయం రూ.2.45 లక్షలుగా ఉంది. ఇవాళ ఒక్కరోజే రూ.15 వేలు డౌన్ అయింది. ఇక హైదరాబాద్‌లో ఇవాళ రూ.20 వేలు క్రాష్ అయింది. ప్రస్తుతం రూ.2.30 లక్షల వద్ద ఉంది. చెన్నై, బెంగళూరులో కూడా ఇలాగే కొనసాగుతున్నాయి.

### దేశీయ స్టాక్ మార్కెట్లకు బ్లాక్ మండే..

## మదుపర్ల సంపద 14 లక్షల కోట్లు ఆవిరి

దేశీయ స్టాక్ మార్కెట్ల పాలిట ఈ సోమవారం బ్లాక్ మండేగా మారింది. డొమెస్టిక్ మార్కెట్ సూచీలు ఇవాళ భారీగా నష్టపోయాయి. పశ్చిమాసియాలో అమెరికా,ఇజ్రాయెల్-ఇరాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరుగుతుండటం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. చమురు ధరలు భారీగా పెరగడం, విదేశీ సంస్థాగత మదుపర్ల విక్రయాలు కొనసాగుతుండటం సూచీలపై ప్రతికూల ప్రభావం చూపింది. సెన్సెక్స్ ఒక దశలో 2 వేల పాయింట్ల మేర నష్టపోగా.. నిఫ్టీ 22,500 పాయింట్ల మార్కుకు కాస్త ఎగువన ముగిసింది.ఫలితంగా ఒక్కరోజులోనే మదుపర్ల సంపద దాదాపు రూ.14 లక్షల కోట్లు ఆవిరైపోయి రూ.415 లక్షల కోట్లకు చేరింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ తొలిసారి 94 మార్కు దాటి 94.01 వద్ద ఆల్‌టైమ్ కనిష్ఠానికి చేరింది. సెన్సెక్స్ ఉదయం 73,732.58



పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 74,532.96) భారీ నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాలు కొనసాగాయి. ఇంట్రాడేలో 72,558.44 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 1836.57 పాయింట్ల నష్టంతో 72,696.39 వద్ద ముగిసింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ సైతం 601.85 పాయింట్ల నష్టంతో 22,512.65 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా స్టాక్స్ మినహా మిగిలిన స్టాక్స్ నష్టాలు చవిచూశాయి. టైటాన్, ట్రెంట్, అల్ట్రాటెక్ సిమెంట్, బీఈఎల్, ఇండిగో స్టాక్స్ ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 113.20 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం 4,272 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## ఏప్రిల్‌లోనూ ఆసియాకు తగ్గనున్న చమురు సరఫరా

సింగపూర్ : ప్రపంచంలోనే ప్రధాన చమురు ఎగుమతిదారు సౌదీ అరామ్కో ఆసియాకు ఏప్రిల్‌లో వరుసగా రెండవ నెల కూడా చమురు సరఫరాను తగ్గించినట్లు సంబంధిత వర్గాలు సోమవారం తెలిపాయి. ఏప్రిల్‌లో యాన్బులోని రెడ్‌సీ పోర్ట్ నుండి ఎగుమతి అయిన అరబ్ లైట్ క్రూడ్‌ను మాత్రమే సరఫరా చేయనున్నట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి. ఆసియా రిఫైనరీలకు సరఫరా తగ్గనుండటంతో శుద్ధి చేసిన ఉత్పత్తులపై పరిమితులు మరింత తీవ్రం కానున్నాయి. ఈ వార్తపై అరామ్కో స్పందించాల్సివుంది. సౌదీ





అరేబియా మార్చిలో రోజుకి 4.355మిలియన్ బ్యారెల్స్‌ను ఎగుమతి చేసినట్లు క్ప్లెర్ సంస్థ తెలిపింది. రోజుకి 7.108 మిలియన్ బ్యారెల్స్‌ను ఎగుమతి చేసిన ఫిబ్రవరి నెలతో పోలిస్తే ఎగుమతి తగ్గినట్లు సంస్థ పేర్కొంది. హార్ముజ్ జలసంధిలో ఏర్పడిన అంతరాయాన్ని భర్తీ చేసేందుకు అరామ్కో సంస్థ యాన్బు పోర్ట్ నుండి ముడి చమురు ఎగుమతిని పెంచేందుకు యత్నిస్తోంది. దీంతో మార్చిలో లోడింగ్ రికార్డు స్థాయికి పెరుగుతాయని అంచనావేస్తోంది. చైనా సంస్థ సినోపెక్, మార్చిలో యాన్బు పోర్ట్ నుండి సుమారు 24 మిలియన్ బ్యారెల్ల సౌదీ ముడిచమురును పంపిణీ చేసేందుకు యత్నిస్తోంది. సౌదీ అరామ్కోకి చెందిన సమ్రెఫ్ రిఫైనరీ సమీపంలో ఒక డ్రోన్ కూలిపోవడంతో, గురువారం (మార్చి 19న ) యాన్బు పోర్ట్‌లో చమురు లోడింగ్‌కు కొంతసేపు అంతరాయం కలిగిన సంగతి తెలిసిందే.

# స్పోర్ట్స్

## ప్రాక్టీస్ మ్యాచ్‌లో దుమ్మురేపిన కోహ్లీ

ఐపీఎల్ 2026 సీజన్ కోసం డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) సిద్ధమవుతోంది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా టైటిల్ నిలబెట్టుకోవడమే లక్ష్యంగా సన్నద్ధమవుతోంది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా ప్రాక్టీస్ క్యాంప్‌లో ముమ్మరంగా సాధన చేస్తోంది. మరో 5 రోజుల్లో ఈ క్యాష్ రిచ్ లీగ్ తెరలేవనుండటంతో అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకోంటుంది. ఈ సన్నాహకాల్లో భాగంగా ఆదివారం ఇంట్రా స్క్వాడ్ ప్రాక్టీస్ మ్యాచ్ ఆడింది. జట్టులోని ఆటగాళ్లంతా రెండు జట్లుగా విడిపోయారు. ఒక జట్టుకు కృనాల్ పాండ్యా సారథ్యం వహించగా.. మరో జట్టును వెంకటేష్ అయ్యర్ నడిపించాడు. ఈ సన్నాహక మ్యాచ్‌లో జితేశ్ శర్మ విధ్వంసకర బ్యాటింగ్ చెలరేగాడు. 37 బంతుల్లో 81 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. గత సీజన్ తరహాలోనే ఈ సీజన్‌లోనూ ఆర్‌సీబీ ఫినిషర్‌గా సత్తా చాటేందుకు రెడీ



అయ్యాడు. అతని తర్వాత ఆస్ట్రేలియా ఆటగాడు టిమ్ డేవిడ్ 14 బంతుల్లో 36 పరుగులు చేశాడు. రూ.7 కోట్లు పెట్టి కొనుగోలు చేసిన వెంకటేష్ అయ్యర్ 16 బంతుల్లో 30 పరుగులు చేశాడు.ఓపెనర్‌గా బరిలోకి దిగిన ఆర్‌సీబీ స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ 12 బంతుల్లో 3 సిక్సర్లతో 29 పరుగులు చేశాడు. తక్కువ పరుగులే చేసినా.. దూకుడుగా ఆడాడు. వెంకటేశ్ అయ్యర్‌ను మిడిలార్డర్‌లో ఆడించాలనే యోచనలో ఆర్‌సీబీ మేనేజ్‌మెంట్ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాక్టీస్ మ్యాచ్‌కు సంబంధించిన ఒక వీడియోను ఆర్‌సీబీ ఫ్రాంచైజీ సోమవారం సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. ఈ వీడియోలో కృనాల్ పాండ్యా మాట్లాడుతూ.. 'ఇది ఒక గొప్ప ప్రాక్టీస్ మ్యాచ్. భువనేశ్వర్ కుమార్, అభినందన్ సింగ్, మంగేష్ యాదవ్ బౌలింగ్‌లో బాగా రాణించాడు. జితేష్ శర్మ, టిమ్ డేవిడ్, వెంకటేష్ అయ్యర్, విరాట్ కోహ్లీ అద్భుతంగా బ్యాటింగ్ చేశారు'అని తెలిపాడు. ఐపీఎల్ 2025 సీజన్ ఫైనల్లో పంజాబ్ కింగ్స్‌ను ఓడించి ఆర్‌సీబీ తమ తొలి టైటిల్‌ను అందుకున్న విషయం తెలిసిందే. ఈ జోరును తాజా సీజన్‌లోనూ కొనసాగించి టైటిల్ నిలబెట్టుకోవాలనే పట్టుదలతో ఉంది. ఐపీఎల్ 2026 సీజన్ ఆరంభ మ్యాచ్‌లోనే ఆర్‌సీబీ.. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తలపడనుంది. ఫస్టాఫ్ షెడ్యూల్‌లో ఆర్‌సీబీ.. చిన్నస్వామి స్టేడియంలో రెండు మ్యాచ్‌లు ఆడనుంది. గౌహతిలో రాజస్థాన్ రాయల్స్, ముంబైలో ముంబై ఇండియన్స్‌తో తలపడనుంది..

## న్యూజిలాండ్‌ను చిత్తు చేసిన సౌతాఫ్రికా..

**ఐదు మ్యాచ్‌ల సిరీస్ 2-2తో సమం**



వెల్లింగ్టన్ వేదికగా జరిగిన నాలుగో టీ20 మ్యాచ్‌లో సౌతాఫ్రికా జట్టు 19 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌పై ఘనవిజయం సాధించింది. ఈ గెలుపుతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-2తో సమం చేసింది. మొదట బ్యాటింగ్ చేసిన సౌతాఆఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 164 పరుగులు చేయగా, లక్ష్య ఛేదనలో న్యూజిలాండ్ 18.5 ఓవర్లలో 145 పరుగులకే కుప్పకూలింది. సౌతాఫ్రికా బ్యాటర్ కానర్ ఎస్టర్‌హ్యూజెన్ 36 బంతుల్లో 57 పరుగులతో మెరుపు హాఫ్ సెంచరీ చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. కివీస్ ఓపెనర్ టిమ్ రాబిన్సన్ 32 పరుగులతో శు భారంభం ఇచ్చినప్పటికీ, మిడిల్ ఆర్డర్ విఫలం కావడంతో ఆతిథ్య జట్టుకు ఓటమి తప్పలేదు. ఈ విజయంతో సౌతాఫ్రికా ఆటగాళ్లలో కొత్త ఉత్సాహం నెలకొంది. ఈ మ్యాచ్‌లో సౌతాఫ్రికా స్పిన్నర్లు కేశవ్ మహారాజ్, ప్రినిలన్ సుబ్రాయన్ అద్భుతంగా బౌలింగ్ చేసి న్యూజిలాండ్ బ్యాటర్లను కట్టడి చేశారు. అరంగేట్రం చేసిన సుబ్రాయన్ 13 పరుగులకే 2 వికెట్లు తీసి కివీస్ పతనాన్ని శాసించాడు. అలాగే కెప్టెన్ కేశవ్ మహారాజ్ 22 పరుగులిచ్చి 2 వికెట్లు పడగొట్టి తన అనుభవాన్ని చాటుకున్నాడు. ఫాస్ట్ బౌలర్ గెరాల్డ్ కోయెట్జీ 3 వికెట్లు తీసి ప్రత్యర్థిని కోలుకోలేని దెబ్బ తీశాడు. న్యూజిలాండ్ ఒకానొక సమయంలో 8.2 ఓవర్లలో 76/2 స్కోరుతో పటిష్టంగా కనిపించినా, ఆ తర్వాత వరుసగా వికెట్లు కోల్పోయి మ్యాచ్‌పై పట్టు కోల్పోయింది. న్యూజిలాండ్ జట్టులో టామ్ లాథమ్, మిచెల్ సాంట్నర్ వంటి సీనియర్ ఆటగాళ్లు లేకపోవడం ఆ జట్టుపై స్పష్టంగా కనిపించింది. ఐపీఎల్ 2026 కోసం కొంతమంది ఆటగాళ్లు భారత్‌కు బయలుదేరడం వల్ల కివీస్ తన రెండో శ్రేణి జట్టుతో బరిలోకి దిగింది. ఈ మ్యాచ్‌లో గెలిచి సిరీస్ సొంతం చేసుకోవాలని భావించిన కివీస్‌కు సౌతాఫ్రికా గట్టి షాక్ ఇచ్చింది. సిరీస్ విజేతను నిర్ణయించే ఐదో మరియు చివరి టీ20 మ్యాచ్ బుధవారం క్రైస్ట్‌చర్చ్‌లో జరగనుంది. ఈ పోరులో ఎవరు గెలిస్తే వారే సిరీస్ విజేతగా నిలుస్తారు.

## ఐపీఎల్ కోసం వెళ్తే కఠిన చర్యలు

**-విదేశీ ఆటగాళ్లకు పీసీబీ ఛైర్మన్ వార్నింగ్**

చివరి నిమిషంలో పాకిస్థాన్ సూపర్ లీగ్(పీఎస్ఎల్) నుంచి తప్పుకునే విదేశీ ఆటగాళ్లను పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) ఛైర్మన్ మోహిసిన్ నఖ్వీ హెచ్చరించాడు. ఐపీఎల్ 2026 సీజన్ కోసం పీఎస్ఎల్ నుంచి తప్పుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించాడు. వరుసగా రెండో ఏడాది కూడా పాకిస్థాన్ సూపర్ లీగ్(పీఎస్ఎల్), ఐపీఎల్‌లు ఒకే సమయంలో జరగనున్నాయి. దాంతో చాలా మంది విదేశీ ఆటగాళ్లు పీఎస్ఎల్‌ను వదిలేసి ఐపీఎల్ ఆడేందుకు మొగ్గు చూపుతున్నారు. జింబాబ్వే పేసర్ బ్లెస్సింగ్ ముజరాబానీ, శ్రీలంక స్టార్ ఆల్‌రౌండర్ దసున్ షనక, ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ సామ్ కరన్ పీఎస్ఎల్‌ను వీడి ఐపీఎల్ ఆడేందుకు సిద్ధమయ్యారు. చివరి నిమిషంలో ఈ ఆటగాళ్లు



పాకిస్థాన్ సూపర్ లీగ్ ఫ్రాంచైజీలతో తమ ఒప్పందాలను రద్దు చేసుకున్నారు. ఇస్లామాబాద్ యునైటెడ్ జట్టుతో బ్లెస్సింగ్ ముజారాబానీ, లాహోర్ ఖలందర్స్ జట్టుతో దసన్ షనక తమ కాంట్రాక్టులను వదులుకున్నారు. ఈ వ్యవహారంపై స్పందించిన మోహిసిన్ నఖ్వీ విదేశీ ఆటగాళ్లపై విమర్శలు గుప్పించాడు. 'మేం రూల్స్ ప్రకారం ఆటగాళ్లపై చర్యలు తీసుకుంటాం. గతేడాది పెషావర్ జల్మికి ఆడిన కార్బిన్ బోష్.. ఆఖరి నిమిషంలో జట్టును వీడి ముంబై ఇండియన్స్‌లో చేరాడు. దాంతో పీఎస్ఎల్ ఆడకుండా అతనిపై ఏడాది పాటు నిషేధం విధించారు. ఈ సారి కూడా అదే విధమైన కఠిన చర్యలు తీసుకుంటాం. ఐపీఎల్‌తో షెడ్యూల్ క్లాష్ అవ్వడం వల్ల మాకు ఎలాంటి ఇబ్బంది లేదు. కొంతమంది ఆటగాళ్లు అక్కడికి వెళ్లినప్పటికీ, చాలా మంది అగ్రశ్రేణి ఆటగాళ్లు మా కోసం ఆడటానికి ఇక్కడికి వస్తారు. మరే విండో ఖాళీ లేనందున ఈ సమయంలోనే పీఎస్ఎల్‌ను నిర్వహించాలని మేం నిర్ణయించుకున్నాం.'అని మోహసిన్ నఖ్వీ చెప్పుకొచ్చాడు. గుడకేష్ మోతీ, జేక్ ఫ్రేజర్ మెక్‌గర్క్, ఒట్నీయల్ బార్ట్‌మన్, స్పెన్సర్ జాన్సన్ వంటి ఆటగాళ్లు కూడా వ్యక్తిగత కారణాలతో పీఎస్ఎల్‌కు దూరమయ్యారు. పీఎస్ఎల్ సీజన్ మార్చి 26 నుంచి ప్రారంభం కానుండగా.. ఐపీఎల్ 2026 సీజన్‌కు మార్చి 28న తెరలేవనుంది.



క్యూట్ స్టైల్‌తో కవ్విస్తున్న కుర్ర భామ ఇవానా.




## రౌడీ జనార్ధన్ మూవీ

# కోసం విజయ్ కసరత్తు

టాలీవుడ్ యాక్టర్ విజయ్ దేవరకొండ బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టాడు. వీటిలో ఒకటి రాహుల్ సంకీర్త్యన్‌తో చేస్తున్న పీరియడ్ యాక్షన్ డ్రామా. విజయ్ మరోవైపు దిల్ రాజు నిర్మాణంలో రవికిరణ్ కోలా దర్శకత్వంలో ఓ రూరల్ మాస్ డ్రామాకు కమిటవగా.. ఈ చిత్రానికి రౌడీ జనార్ధన అనే టైటిల్ కూడా ఖరారు చేశారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో గ్రాండ్ స్కేల్‌లో ఉండబోయే యాక్షన్ సీక్వెన్స్‌ను విజయ్ టీం డిజైన్ చేస్తుందట. ముంబై స్లమ్స్ ఏరియాలో రాబోయే హై ఆక్టేన్ ఫైట్ సీక్వెన్స్ సినిమాకే హైలెట్‌గా నిలువబోతుందట. ఇంటెన్స్, రియలిస్టిక్ యాక్షన్ ఎక్స్‌పీరియన్స్ అందించేలా ఈ ఎపిసోడ్ ఉండనుందిని ఇన్‌సైడ్ టాక్. ఇప్పటికే విజయ్ దేవరకొండ ట్రాన్స్‌ఫార్మేషన్ సినిమాపై మంచి బజ్ క్రియేట్ చేస్తుంది. రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో రియల్ మాస్ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ చిత్రంలో విజయ్ పాత్ర పేరు జనార్ధన్ కాగా, ఆయన నాన్న పేరు కూడా జనార్ధనేనని ఇన్‌సైడ్ టాక్. విజయ్ దేవరకొండకు 'రౌడీ' అనే ట్యాగ్ ఎప్పటి నుంచో ఉంది. ఇప్పుడు రౌడీ టైటిల్‌తో సినిమా వస్తుండడంతో ఫ్యాన్స్ అంతా ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఈ సినిమాతో విజయ్ తన విశ్వరూపం చూపించనున్నాడని కామెంట్ చేస్తున్నారు.



# రీ ఎంట్రీ ఇస్తున్న నటి రోజా

## 12 ఏళ్ల తరవాత తమిళ మూవీతో స్టార్ట్



తమిళ సినీ పరిశ్రమలో సీనియర్ నటీమణుల రీఎంట్రీ ట్రెండ్ కొనసాగుతోంది. ఇటీవల శోభన తిరిగి కోలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. ఇప్పుడు మరో ఫైర్‌బ్రారడ్ నటి, రాజకీయ నాయకురాలు ఆర్కే రోజా కూడా మళ్లీ తమిళ సినిమాల్లో బిజీ అవుతున్నారు. గత కొంతకాలంగా రాజకీయాల్లో చురుకుగా ఉన్న రోజా, ప్రస్తుతం సినిమాలపై మళ్లీ ఫోకస్ పెట్టారు. 12 ఏళ్ల విరామం తర్వాత ఆమె తమిళ ఇండస్ట్రీలోకి రీఎంట్రీ ఇస్తుండటం విశేషం. ఇప్పటికే ఆమె నటించిన లెనిన్ పాండ్యన్ షూటింగ్ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధంగా ఉంది.ఇదే సమయంలో రోజా నటిస్తున్న మరో చిత్రం అన్టే డయానా కోలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. పారి ఎలవళగన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో రమ్య రంగనాథన్ హీరోయిన్‌గా కనిపించ నున్నారు. చెన్నైలోని పెరంబూర్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ రొమాంటిక్ లవ్ స్టోరీలో రోజా కీలక పాత్రలో, ముఖ్యంగా హీరో తల్లి పాత్రలో కనిపించబోతున్నారు. ఇటీవల ఈ సినిమా నుంచి విడుదలైన 'పెరంబూర్ గానా' సాంగ్ మంచి స్పందన అందుకుంటోంది. ముఖ్యంగా ఈ పాటలో రోజా చేసిన మాస్ స్టెప్పులు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. చాలా గ్యాప్ తర్వాత కూడా తన ఎనర్జీ తగ్గలేదని మరోసారి నిరూపించారు. ఈ పాట వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.మిలియన్ డాలర్ స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తవగా, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ప్రమోషన్స్‌లో భాగంగా లిరికల్ వీడియోలు విడుదల చేస్తూ సినిమాపై అంచనాలు పెంచుతున్నారు. ఇటీవల సీనియర్ నటి రాధిక నటించిన 'తాయి కిళవి' భారీ విజయాన్ని సాధించడంతో, ఇప్పుడు రోజా రీఎంట్రీ మూవీపై కూడా కోలీవుడ్‌లో మంచి బజ్ నెలకొంది. సుదీర్ఘ విరామం తర్వాత రోజా మళ్లీ తెరపై కనిపించబోతుండటంతో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ రీఎంట్రీతో కోలీవుడ్‌లో రోజా మరోసారి తన సత్తా చాటుతారా అన్నది చూడాలి.

# ఒంటరిగా కూర్చుని ఏడ్చేదాన్ని

కెరీర్ ప్రారంభంలో కథానాయిక శ్రీలీలను ట్రోలింగ్స్ చాలా ఇబ్బంది పెట్టాయట. ఈ కారణంగా ఓ దశలో ఆమె కన్నీటి పర్యంతం అయ్యిందట. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఈ విషయాలను వెల్లడించింది శ్రీలీల. 'నేను చాలా సెన్సిటీవ్. అందుకే కెరీర్ తొలినాళ్లలో నాపై వచ్చిన ట్రోల్స్ చూసి తట్టుకోలేకపోయాను. ఒంటరిగా కూర్చొని ఏడ్చేదాన్ని. ఓ దశలో అవి శృతిమించడంతో నా మనసంతా నిరాశ అలముకుంది.సినిమాలు నా ఒంటికి పడవని నిర్ణయానికి వచ్చేసి, ఆ విషయాన్ని అమ్మకు చెప్పాను. కాలేజ్‌కెళ్లి చదువుకుంటానన్నాను. అప్పుడు అమ్మ చెప్పిన మాటలు నాలో మార్పుని తెచ్చాయి. 'నీ గురించి వాళ్లు అంత సమయాన్ని వృధా చేసుకుంటున్నారంటే నువ్వు ఎదిగావని అర్థం. ఎంతో పుణ్యం చేసుకుంటే తప్ప హీరోయిన్ కాలేరు. ఈ ఫేమ్ తేలిగ్గా రాదు.. అర్థం చేసుకో..' అని అమ్మ నచ్చజెప్పింది. అప్పట్నుంచి ట్రోల్స్‌ని చదవడం, చూడటం మానేశా. నెగిటివ్ కామెంట్స్‌ని ఎలా డీల్ చేయాలో నేర్చుకున్నా' అంటూ తనలో వచ్చిన మార్పు గురించి గర్వంగా చెప్పుకున్నది శ్రీలీల.

# బైకర్ ట్రైలర్‌కు ప్రభాస్ ప్రంశసలు




టాలీవుడ్ ఛార్మింగ్ స్టార్ శర్వానంద్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ చిత్రం బైకర్ ఇప్పటికే సినీ వర్గాల్లో సాలిడ్ బజ్ క్రియేట్ చేసింది. ఇండియాలోనే తొలి మోటోక్రాస్ రేసింగ్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమా తన కాన్సెప్ట్‌తో ప్రత్యేక గుర్తింపును సంపాదించింది. తాజాగా విడుదలైన ట్రైలర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటూ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలుస్తోంది.ఈ ట్రైలర్‌పై పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ స్పందించడం మరింత ఆసక్తిని రేకెత్తించింది. తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ప్రభాస్ 'బైకర్ ట్రైలర్ వైబ్ అదిరిపోయింది' అంటూ ప్రశంసలు కురిపించాడు. ట్రైలర్ చాలా ఎంగేజింగ్‌గా ఉందని, సినిమా టీమ్‌కు తన శుభాకాంక్షలు తెలియజేశాడు. ముఖ్యంగా శర్వానంద్‌తో పాటు నిర్మాణ సంస్థకు కూడా విజయాన్ని కోరుకున్నాడు. ఈ ట్రైలర్‌లో హై-ఆక్టేన్ రేసింగ్ సీన్స్, ఎమోషనల్ ఎలిమెంట్స్, ఫ్యామిలీ బ్యాక్‌డ్రాప్ అన్నీ బ్యాలెన్స్‌డ్ చూపించడం విశేషం. శర్వానంద్ పూర్తిగా కొత్త లుక్‌లో కనిపిస్తూ, రేసర్ పాత్రలో తన ట్రాన్స్‌ఫర్మేషన్‌తో ఆకట్టుకుంటున్నాడు. మరోవైపు సీనియర్ నటుడు రాజశేఖర్ పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనుండటం సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా మాళవిక నాయర్ నటిస్తుండగా, భారీ తారాగణం ఈ ప్రాజెక్ట్‌లో భాగమైంది. దర్శకుడు అభిలాష్ రెడ్డి ఈ చిత్రాన్ని స్టైలిష్ రేసింగ్ డ్రామాగా రూపొందిస్తున్నారు. యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ మూవీ టెక్నికల్‌గా కూడా హై స్టాండర్డ్స్‌తో తెరకెక్కుతున్నట్లు ట్రైలర్ ద్వారా స్పష్టమవుతోంది. మోటోక్రాస్ రేసింగ్ వంటి కొత్త కాన్సెప్ట్‌తో వస్తున్న ఈ సినిమా తెలుగు ప్రేక్షకులకు ఒక ఫ్రెష్ ఎక్స్‌పీరియెన్స్ ఇవ్వనుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. ఇప్పటికే ట్రైలర్‌కు వస్తున్న స్పందనను బట్టి, ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి ఓపెనింగ్స్ సాధించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఏప్రిల్ 3న గ్రాండ్‌గా విడుదల కానున్న 'బైకర్' మూవీ, శర్వానంద్ కెరీర్‌లో ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది.

# క్రేజీ కాంబినేషన్ కుదిరిందా?



ఏడాదికి రెండు సినిమాలు చేయాలని బాలకృష్ణ గట్టిగా ఫిక్సయ్యారు. అందులో భాగంగానే గత ఏడాది డాకూమహారాజ్, అఖండ 2 చిత్రాలతో ప్రేక్షకుల్ని పలకరించారాయన. ప్రస్తుతం మలినేని గోపీచంద్ దర్శకత్వంలో బాలకృష్ణ నటిస్తున్న చిత్రం ఈ ఏడాది దసరాకి విడుదల కానుంది. ఆ వెంటనే, డిసెంబర్‌లోకానీ, సంక్రాంతికి కానీ మరో సినిమాను విడుదల చేయాలనే తలంపుతో ఉన్నారు బాలకృష్ణ.అందులో భాగంగానే దర్శకుడు వివేక్ ఆత్రేయ కథకు ఓకే చెప్పినట్టు విశ్వసనీయంగా తెలిసింది. మైత్రీ మూవీమేకర్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మించనున్నది. అయ్యప్పన్ కొషియం, తుడరుమ్, కొత్తలోక, సరిపోదా శనివారం చిత్రాలకు అద్భుతమైన సంగీతాన్ని అందించిన జేక్స్ బెజోయ్ ఈ చిత్రానికి సంగీత దర్శకత్వం వహించనున్నారట. ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే రానుంది.


Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, PRGI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365